తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఆదివారం

14 జూన్ 2026




# బడుల వేడుక జ్ఞానానికి వేదిక

# మెగా సినిమాలో నారా రోహిత్!

మెగాస్టార్ చిరంజీవి- బాబీ కొల్లి కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతుంది. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ సినిమా పై ఓ క్రేజీ అప్ డేట్ వినిపిస్తోంది. ఈ సినిమా సినిమా క్లైమాక్స్‌లో ఓ అతిథి పాత్ర ఉందని.. ఆ పాత్రలో మరో హీరో కనిపించబోతున్నాడనీ.. ఆ హీరో నారా రోహిత్ అని టాక్ నడుస్తోంది. ఇక ఈ సినిమా సెకండ్ హాఫ్‌లో వచ్చే ఫ్లాష్ బ్యాక్ కోసం మెగా స్టార్ సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నాడు. పైగా ఈ సినిమాలో చిరు



పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయని తెలుస్తోంది.

అలాగే, ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా ఉంటాయని సమాచారం. స్టోరీ సైతం ప్రత్యేకంగా ఉంటుందట. చిరును కొత్తగా చూపించాలనే ఉద్దేశంతో ఈ కథ రాసుకున్నారట బాబీ. కాగా ఈ సినిమాని కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాతలు వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. గతంలో చిరు, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' మంచి విజయం సాధించింది.

తారాతీరం

తెలుస్తోంది. సినిమాలో మంచి ఎమోషన్స్ ఉన్నాయని.. పైగా పాత్రలు కూడా ఎక్కువ ఉన్నాయని..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్

# బన్నీ, దీపికా పదుకొణె జంటగా 'రాకా'

డైరెక్టర్ అట్లీ సినిమా 'రాకా' తాజా సుమాచారం కోసం బన్నీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే, మళయాళ బ్యూటీ ఫెమినా జార్జ్ ఈ సినిమాలో యాక్ట్ చేస్తోంది. ఇప్పటికే ఆమె 'రాకా' యూనిట్‌లో చేరింది. వచ్చే షెడ్యూల్‌లో ఈ సినిమా టీమ్‌లోకి మరో కథానాయిక కూడా వచ్చి చేరనున్నట్లు త్వరలోనే మరో యంగ్ హీరోయిన్ సైతం ఓ ఎమోషనల్ పాత్రలో నటించబోతోందని తెలుస్తోంది.

ప్రస్తుతం 'రాకా' షూటింగ్ ముంబయిలో నడుస్తోంది. బన్నీ ఈ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. కాగా భారీ స్థాయిలో, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో యాక్షన్ అద్భుతంగా ఉంటుందని సమాచారం.. ఈ మూవీలో దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో దీపికా పదుకోణెతో పాటు మృణాల్ ఠాకూర్ కూడా హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే, జాన్వీ కపూర్ కూడా మరో హీరోయిన్‌గా నటిస్తోంది. మాఫియా బ్యాక్ డ్రాప్‌లో ఓ డాన్ చుట్టూ ఈ కథా నేపథ్యం సాగుతుందట. సన్ పిక్చర్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు.



ఆదివారం వార్త

14 జూన్, 2026

## మంచి ముత్యాలు

తాబేలు తన అవయవాలను లోనికి ముడుచుకున్నట్లు, యోగి తన ఇంద్రియాలను విషయాల నుండి ఎపుడు మరల్చుకుంటాడో అప్పుడు అతని జ్ఞానం స్థిరమౌతుంది. - భగవద్గీత

## కదంబం


'సంఘీ'భావం....5

తప్పనిసరి కానున్న ఏఐ వినియోగం

కవర్ స్టోరీ..6

బడుల వేడుక జ్ఞానానికి వేదిక

ఈ వారం కవిత్వం.. 11

అక్షర సుమాలు

సూపర్ ఫుడ్ .....14

కథ..20

ప్రక్షాళన

ఇంకా...

మొగ్గ

పుస్తక సమీక్ష

వాస్తు

వారఫలం

వగైరా.. వగైరా..


# సమాచారం

## ఇంద్రధనస్సుల రాజధాని

ఆకాశంలో రంగుల హరివిల్లు కనిపించగానే పనులన్నీ పక్కన పెట్టి మరీ ఆసక్తిగా చూస్తాం మనం. కానీ ఓ నగరంలో మాత్రం రోడ్డుపై వెళ్లేవాళ్లు ఇంద్రధనస్సును చూసి కనీసం తల కూడా పైకెత్తరు. ఎందుకంటే అక్కడ అవి ఏర్పడడం చాలా సర్వ సాధారణమైన విషయం. ఉదయం కాఫీ తాగే సమయానికే కళ్లముందు డబుల్ రెయిన్‌బోలు ప్రత్యక్షమవుతాయి. అందుకే ఆ ప్రాంతాన్ని ప్రపంచ 'ఇంద్రధనస్సుల రాజధాని' అని పిలుస్తారు. అదే అమెరికాలోని పసిఫిక్ సముద్ర తీరాన ఉన్న 'హవాయి' దీవుల సమూహం. దీనిని 'రెయిన్‌బో స్టేట్' అని పిలుస్తారు.

దీని వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. ఇక్కడి పసిఫిక్ సముద్ర గాలులు, ఎత్తైన పర్వతాలు, పచ్చని లోయల కారణంగా ఓవైపు ఎండ కాస్తుండగానే మరోవైపు చిన్నపాటి జల్లులు కురుస్తాయి. ఈ వింత వాతావరణం వల్లే ఇక్కడ నిరంతరం అద్భుతమైన ఇంద్రధనస్సులు ఏర్పడుతుంటాయి. స్వచ్ఛమైన గాలి కారణంగా ఇక్కడి రంగులు చాలా స్పష్టంగా, విభిన్న రూపాల్లో మెరుస్తాయి.



హవాయికి సంబంధించి మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఇక్కడ పగటిపూటే కాదు.. రాత్రి వేళల్లోనూ ఇంద్రధనస్సులు వస్తాయి. వీటిని 'మూన్‌బోస్' లేదా 'చంద్ర ధనస్సులు' అంటారు. పౌర్ణమి రోజుల్లో చంద్రుడి వెలుతురు వర్షపు బిందువులపై పడినప్పుడు చీకటి ఆకాశంలో ఈ అద్భుతం ఆవిష్కృతమవుతుంది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

# హైటెక్ మత్స్యయంత్రం



సముద్రంలో అండర్‌వాటర్ డ్రోన్‌గా పనిచేసే ఈ హైటెక్ మత్స్యయంత్రాన్ని చైనా కంపెనీ ఫిఫిష్ వి ఇవో పేరుతో రూపొందించింది. ఇది సముద్రంలోని అట్టడుగు ప్రాంతాల వరకు వెళ్లగలదు. సముద్రంలోని దృశ్యాలను తన కెమెరాల ద్వారా వీడియో తీస్తుంది. ఈ పరికరానికి అన్నివైపులా కెమెరాలతో పాటు స్పాట్‌లైట్లు కూడా ఉండటంతో సముద్రంలోని చీకటి ప్రాంతాల్లోని దృశ్యాలను కూడా స్పష్టంగా చిత్రీకరిస్తుంది. దీనిని రిమోట్ కంట్రోల్ ద్వారా ఆపరేట్ చేయవచ్చు. స్మార్ట్‌ఫోన్ యాప్ ద్వారా ఇది తీసే వీడియోలను ఎప్పటికప్పుడు వీక్షించవచ్చు. ఈ హైటెక్ మత్స్యయంత్రం ఒక్క సెకనుకు 60 ఫ్రేములను చిత్రిస్తుంది.

# ఫ్లోటింగ్ ఆఫీస్ రోటర్‌డ్యామ్



నెదర్లాండ్‌లోని రోటర్‌డ్యామ్‌లో అలలపై తేలే ఆఫీసు ఉంటుంది. అలలపై ఆఫీసు తేలడమేమిటి? వినడానికి విచిత్రంగా ఉన్నప్పటికీ గ్లోబల్ సెంటర్ ఆన్ అడాప్టేషన్ సంస్థ జిసిఎ కార్యాలయాన్ని నీళ్లపై నిర్మించింది. అందుకే దీన్ని ‘ఫ్లోటింగ్ ఆఫీస్ రోటర్‌డ్యామ్’గా పిలుస్తారు. రిన్వెవెన్ హార్బర్‌కే ల్యాండ్‌మార్క్‌గా ఉన్న ఈ భవనం ప్రపంచంలోనే అతిపెద్ద ఆఫీసు నిర్మాణంగా రికార్డులకెక్కింది.

ఈ కార్యాలయాన్ని దాదాపు 40 వేల చదరపు అడుగులతో మూడు అంతస్తులుగా నిర్మించారు. పైకప్పును పూర్తిగా పచ్చగడ్డితో రూపొందించారు. ఇది పూర్తి పర్యావరణ అనుకూలం. ఈ ఆఫీసులో సౌరశక్తిని పూర్తిస్థాయిలో వినియోగిస్తారు. ఈ బిల్డింగ్ అంతా రీసైకిల్ చేసే విధంగా నిర్మించడం విశేషం. పెరిగే నీటిమట్టంతో పాటు భవనం ఎత్తు కూడా పెరగటం మరో విశేషంగా చెప్పుకోవచ్చు.

# గిటార్ల తయారీకి చిరునామా..



ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఇందులో ఒకదానికి మరొకదానికి పోలిక ఉండదు. దేని ప్రత్యేకత దానిదే. ఆ కారణంగా ఫలానా ఊరు పర్యాటకంగానో, మరో రకంగానో ప్రసిద్ధి చెందుతుంది. అలాంటిదే ఈ గ్రామం.

పశ్చిమ బంగలోని చందితాలా కౌగాచి అనే ఊరు విభిన్నమైనది. బతుకుతెరువు కోసం పట్నవాసం బాట పట్టిన ఇక్కడివారు ఇప్పుడు ఈ ఊరికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువస్తున్నారు. ఇంతకూ అసలు సంగతేమిటంటే.. ఇప్పుడు దేశంలోని నగరాలతో పాటు దుబాయ్, బంగ్లాదేశ్ మొదలైన దేశాలకు గిటార్‌లను సరఫరా చేస్తున్నారు.

ఎక్కడో మారుమూల పల్లెజనం పాశ్చాత్య వాయిద్యమైన గిటార్‌ను తయారు చేయటం ఎలా నేర్చుకున్నారని సందేహం రావడం సహజం. పొట్టకూటి కోసం కోలకతా వెళ్లిన కూలీలు గిటార్‌లు తయారు చేసే ఫ్యాక్టరీలల్లో పని చేసేవారట. అక్కడ పనిచేయడం వల్ల క్రమంగా గిటార్‌లు తయారు చేయడం నేర్చుకున్నారు. మొదట్లో కొద్ది మందితో ఈ గ్రామంలో మొదలైన గిటార్ ఫ్యాక్టరీ కాలక్రమంలో ఫ్యాక్టరీ సంఖ్య పెరగడం ప్రారంభమైంది. తద్వారా ఈ గ్రామం గిటార్ విలేజ్ ఆఫ్ ఇండియాగా పేరు గడించింది. గిటార్ విలేజ్ కోల్‌కతాకు దగ్గర్లోని శ్యామ్‌నగర్ ప్రాంతంలో ఉంది.

# 'సంఘీ' భావం



## తప్పనిసరి కానున్న ఎఐ వినియోగం

ప్రస్తుతం ప్రతిఒక్కరూ ఎఐని అనుసరిస్తున్నారు. చాలా మందికి వారు ఎఐని వినియోగిస్తున్నామన్న అంశం తెలియకుండానే దానికి అలవాటు పడుతున్నారు, ప్రస్తుతం పరిస్థితుల్లో కృత్రిమ మేథ వల్ల ప్రయోజనమా నష్టమా అన్న అంశం కూడా తరచూ చర్చకు దారితీస్తోంది. అయితే ఈ వ్యవస్థను సక్రమంగా ఉపయోగించుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఎఐ పూర్తిస్థాయిలో వాడకం వస్తే ఉద్యోగాల్లో భారీ కోత ఉంటుందన్న వాదన కూడా ఉంది. ఇందులో కొంత మాత్రమే వాస్తవం ఉంది. పదేపదే ఒకే తరహాలో పనిచేసే ఉద్యోగాలు మాత్రం చాలా వరకు తగ్గిపోతాయి. అయితే ఎఐనే ఉపయోగించి చేసే వ్యాపారాలు, ఉద్యోగాలు క్రమంగా పెరుగుతూనే ఉంటాయి. ఎఐని చూసి భయపడటం కంటే దానిపై స్వారీ చేయడానికి ప్రయత్నించినప్పుడు ఉద్యోగాలు కోల్పోతారన్న భయాలు దూరం అవుతాయి. ఒకప్పుడు కంప్యూటర్లు, ఇంటర్నెట్ ప్రవేశించినప్పుడు భారీ ఎత్తున ఉద్యోగాలు పోతాయని ప్రచారం జరిగింది. అయితే అదే కంప్యూటర్లు, ఇంటర్నెట్ లక్షలాది మంది యువతకు ఐటి జాబ్స్ కల్పించాయి. ప్రస్తుతం కృత్రిమ మేథ కూడా ఇదే పరిస్థితులను కల్పిస్తోంది. ఎఐ పని తీరుపై ఆధిపత్యాన్ని కలిగినప్పుడు ఎలాంటి భయాలు అవసరం ఉండదన్నది ఎంతో మంది సిఇవోలు, ఐటి నిపుణులు స్పష్టం చేస్తున్నారు.ఎఐ సాంకేతికతతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు తగ్గుతున్నాయన్న వాదనను ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ తోసిపుచ్చారు. ఇది అర్థరహిత వాదన అని కొట్టిపారేశారు. తైపీలో (తైవాన్) జరిగిన కంప్యూటెక్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి ఎఐ కారణంగా ఉద్యోగుల ఉత్పాదకత పెరుగుతోందని చెప్పారు. టెకీలకు, ఇంజినీర్లకు ఉద్యోగాలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. వాస్తవాలు పరిశీలిస్తే ఎఐ వల్ల ఉద్యోగ ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. ఇందుకు చక్కని ఉదాహరణ ఉంది. ఎఐ వల్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉత్పాదకత భారీగా పెరుగుతోంది. ఒక ఉద్యోగి ఉత్పాదకత పెరిగితే సంస్థలు మరింత మంది ఇంజినీర్లను నియమించుకోవడం సహజం. ఒక సర్వే ప్రకారం, భారతీయ వర్కర్లలో 71 శాతం మంది రోజూ తమ ఆఫీసులో ఎఐని వినియోగిస్తున్నారు. కొత్త ఐడియాలు, సమస్యలకు పరిష్కారాలు, కెరీర్ ప్లానింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ఎఐ సాయం తీసుకుంటున్నారు. ఎఐని కేవలం ఒక సాధనంగానే కాకుండా ఆఫీసులో విశ్వసనీయ పార్టనర్‌గా భావిస్తున్నారు.

ఎఐ రాకతో ఉద్యోగుల తీరుతెన్నుల్లో మార్పులు వస్తున్నట్టు సర్వేలో తేలింది. ఎఐతో కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటున్నవారు తరచూ జాబ్స్ మారుతున్నారు. అనేక మంది పార్ట్ టైమ్ జాబ్స్, మూన్ లైటింగ్ వంటివి కూడా చేస్తున్నారు. ఎఐ సాయంతో వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌ను కూడా సాధిస్తున్నారు. సివిల్ ఇంజనీరింగ్, మెడికల్, వ్యాపారాలు, పత్రికారంగం, రవాణా, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రస్తుతం ఎఐ వినియోగం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా వైద్య రంగంలో అద్భుతాలు సృష్టిస్తోంది. వ్యాధుల నిర్ధారణ నుంచి చికిత్స వరకు అన్నింటికీ ఈ సాంకేతికతను వైద్యులు అందిపుచ్చుకుంటున్నారు. మోకాలి నొప్పికి చేసే శస్త్రచికిత్సలు నూటికి నూరు శాతం చక్కటి ఫలితాలు ఇస్తున్నాయి. దీనితో దాదాపుగా 80 శాతం ఆసుపత్రుల్లో రోబోటిక్ సర్జరీని విజయవంతంగా నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే పలు దేశాల్లో ఎఐ క్లినిక్‌లు సైతం అందుబాటులోకి వచ్చాయి. భారత్‌లోనూ ఈ తరహా వైద్య విధానాలను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. విద్యారంగంలో ఎఐ కీలకపాత్ర పోషిస్తోంది. ఉన్నత చదువుల్లో, పరిశోధనల్లో ఎఐ కీలకంగా వ్యవహరిస్తోంది. వందల పేజీల పుస్తకాలు చదవడం కంటే తమకు ఏ సబ్జెక్ట్‌లో, ఏ అంశం కావాలో దానిని కేవలం కొన్ని క్షణాల్లో తీసుకుని అభ్యసించే అవకాశం కలుగుతుంది. అదేవిధంగా రవాణా రంగంలో కూడా ఎఐ కీలకంగా మారింది. ముఖ్యంగా రైల్వే వ్యవస్థలో రైళ్ల రాకపోకలను క్రమబద్ధీకరించడం, ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఎఐ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. మనం కాలక్షేపం కోసమో, విజ్ఞానం కోసమో చూసే యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి యాప్‌లలో ఎఐ కీలకంగా వ్యవహరిస్తోంది. మనకు కావాల్సిన కంటెంట్‌ను మన ముందు ఉంచేందుకు కీలక పాత్రను ఎఐ ప్రోత్సహిస్తోంది. భవిష్యత్తులో ఎఐ మరింతగా అభివృద్ధి చెందుతుంది. దానిని అందిపుచ్చుకుని వినియోగించుకుంటేనే ఉద్యోగాలు, ఉపాధి, వ్యాపారాల్లో ఆశించిన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది.

**– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**



కవర్‌స్టోరీ

జంధ్యాల శరత్‌బాబు

# బడుల వేడుక జ్ఞానానికి వేదిక

బడులు మళ్లీ కళకళ. బాలల కళ్లు మిలమిల. వేసవి సెలవులు పూర్తయ్యాయి. తరగతులు తిరిగి మొదలయ్యాయి. ఇది కొత్తదేమీ కాదు. ఏటా ఉండేదే.. మనం చూస్తున్నదే. అయినా

ప్రతీ సంవత్సరం ఈ సందర్భం మహోత్తుంగ తరంగం. ఎందుకంటే.. ఇలా జడిలో తడవడమే పిల్లలకు ఎంతో ఇష్టం!

జూన్ పదిహేను.. ఈ తేదీ బడిబాలల మది రోజుల తరబడి సెలవులు గడిపి, బడిబాట పట్టడమన్నది వాళ్లందరికీ అదో ఇది! ఒక రోజంతా ఉదయం నుంచి సాయంత్రందాకా బడి సందడి!

మహాకవి గుర్తొస్తున్నారు. బాలల లోకాన్ని మన ముందుకు తెస్తున్నారు. “బాలలే విజ్ఞాన హేతువులు. నేడు రేపుల మధ్య సేతువులు/ చంద్ర బంధుర సుధా శీతువులు, మానవత్వ వికాస హేతువులు’.

ఇది బాలల హాయనం. మంచికీ వాతాయనం, ఆనంద రసాయనం.. ఇదే నా ఉపాయనం” అని శ్రీశ్రీ అన్నట్లే అందరి అనుభవమూ అదే! జాతీయంగా, అంతర్జాతీయంగా బాలల దినోత్సవాలున్నాయి. బడుల దినోత్సవమంటూ ఒకటి ఉంటే తప్పకుండా అది ఇప్పుడే.

విద్య, వైద్యం.. ఈ రెండింటి గురించీ ప్రతీ ఒక్కరు మాట్లాడుతుంటారు. పాలకులు పదే పదే అదేపనిగా వల్లె వేస్తుంటారు. పాఠశాల విద్యకి సంబంధించి ఏ ప్రభుత్వమైనా ఇవ్వని హామీ ఉండదు. చేయని ప్రయోగమూ కనిపించదు. కళ్లు చూస్తుంటాయి. నోళ్లు మాట్లాడుతూనే ఉంటాయి. చేతులు సంతకాలు చేస్తుంటాయి. కాళ్లు క్షేత్ర పర్యటనలూ సాగిస్తుంటాయి. బడిపిల్లలు ఏం కోరుకుంటారో తెలుసుకునేందుకు మాత్రం ఎవరికీ మనసు రాదు. అవును మరి.. ఆ పిల్లలు ఓటర్లు కాదుగా!

## తపన అంతా అందుకే..!

పిల్లల తల్లిదండ్రుల గురించే ప్రభుత్వాల ఆలోచనలన్నీ. ఆ పిల్లలకు మేలు చేసి, పెద్దల ఆదరాభిమానాల్ని ఇకముందూ పొందాలన్నదే తాపత్రయమంతా. నట్టనడుమ నిలిచి చూస్తుండేది పాపం బడిపిల్లలే!

తాజాగా వార్తాకథనం ఒకటి వెలువడింది. ఇది రెండు తెలుగు రాష్ట్రాల వారినీ కదిపి కుదిపింది. కారణం– ఒక బడిబాలుడి కంటతడి!

“బడి తెరిచారు.. రోజూ వెళ్లిరావాలి. వెళ్లేది ఎలా, తిరిగి ఇంటికి చేరేది ఇంకెలా? సారూ! మా ఊరికి సర్వీసు రోడ్డు లేదండీ? ఒక్క బస్సూ రావడం లేదండీ. నడిచి నడిచి వెళ్లటం, సాయంత్రానికి పడుతూ లేస్తూ తిరిగి రావడం. ఏం చేయాలి సార్!” అంటూ కన్నీరు పెట్టుకున్నాడు ఆ పిల్లవాడు.





బడికి వెళ్లి వచ్చే క్రమంలోని సమస్య అతడిది.

బడిలోపలి, బడి వెలుపలి సమస్యల మాటేమిటి? అనేకానేక పాఠశాలలకు కనీస వసతులు లేవు. ఎంతకీ రావు. మంచినీరు లేక, మరుగుదొడ్ల సదుపాయం ఉండక నానా అవస్థలు. గాలి, వెలుతురు సరిగా ఉండని తరగతి గదులు ఇంకొన్ని చోట్ల.

ప్రభుత్వాల తీరుతెన్నులు మారుతున్నందున, తరగతి గదుల సదుపాయాలు కొంత మెరుగై ఉండవచ్చు. బడి సమస్యలకు పరిష్కారాలూ ఎంతో కొంత లభించి ఉండనూ వచ్చు. మౌలిక వసతులకు కొరత ఇప్పటికీ కొన్నిచోట్ల వేధిస్తూనే ఉంది కదా! సమాచార, ప్రసార మాధ్యమాలు వాటిని బహిర్గతం చేస్తున్నాయి. వాటిల్లో కొన్నింటికి ప్రభుత్వ స్పందనలూ లభిస్తున్నాయి. కానీ, చీకటి వెలుగుల నడిమధ్యల బడిబాలల నోటిమాట ఎక్కడైనా వినవస్తోందా?

## పూర్వాపరాల పరంపరలు

ఉపాధ్యాయుల కొరత సరేసరి. అంతగా సమస్య లేదంటుంది విద్యాశాఖ. ఉన్న సమస్యను శాఖ చూడటం లేదంటూ మరోవంక నిరసన గళం మోగుతూనే ఉంటుంది. ఉపాధ్యాయ నియామక పరీక్షలు, అనంతర పనులతో ఉక్కిరి బిక్కిరవుతున్నట్లు కనిపిస్తుంటుంది శాఖ. అవును, కాదుల మధ్య బడుల అమ్మాయిలు, అబ్బాయిల మొరను వినిపించుకునేదెవరు? ఆర్చేదీ, తీర్చేదీ ఎవరు? 'సర్కారు బడికి సమస్యల స్వాగతం' అంటుంటే పూర్వాపరాలు ఇవీ' అని వివరించే బాధ్యులు ఎక్కడున్నారు?

విద్యాహక్కు చట్టం అంటూ ఒకటుంది. భారత రాజ్యాంగంలో చోటు చేసుకుంది. పిల్లలను రోజూ బడికి పంపే బాధ్యత తల్లిదండ్రులది అంటోంది. చదువును అందించాల్సిన విధి ప్రభుత్వానిదే అనీ చెప్తోంది. నాణ్యతా ప్రమాణాల నిర్వహణను ఆదేశిస్తోంది/సూచిస్తోంది. అర్హత నిండిన బోధకులనే నియమించాలని, విద్యార్థి నిష్పత్తిని తప్పక పాటించాలని నిర్దేశిస్తోంది. పాఠశాలల ప్రగతి పనుల పర్యవేక్షణకు సంఘాల ఏర్పాటు జరగాలంటోంది. స్థానికంగా బడిబాలల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కమిటీలు పని చేయాలని చెప్తోంది.

ఇవన్నీ అమలైతే, అనుకున్నది అనుకున్నట్లుగా జరిగితే, పిల్లలు రోడ్డెక్కిన అవసరం ఎందుకు కలుగుతుంది?

సమస్యలు తీర్చండని గ్రామస్థులు/పట్టణవాసులతో కలిసి ప్లకార్డులు పట్టుకుని నిల్చునే స్థితి ఎందుకొస్తుంది?

మధ్యాహ్న భోజనం సరిగా లేదని నినదించాల్సిన అగత్యం ఎందుకని ఏర్పడుతుంది?

నినాదాలు, ఆందోళనలు, బైఠాయింపులు, నిరసన ప్రదర్శనల్లో బడిపిల్లలు కనిపించడం ఏమిటి?

ఆలోచన చేయాల్సింది పౌర సమాజమే.

సమస్యల ఒడిలో చదువులు బదులు ఇంకా ఎన్నాళ్లు అన్నదే సమాధానం దొరకాల్సిన ప్రశ్న. మన ఊరు–మన బడి, గోరుముద్ద, ఇంకా ఎన్నెన్నో పేర్లు. కొన్ని పాతబడుతున్నాయి. ఇంకొన్ని సరికొత్తగా వచ్చి చేరుతున్నాయి.

## చిత్తశుద్ధి–లక్ష్యసిద్ధి

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య. అంటే ఆ స్థాయిగల విద్యనే అందిస్తామన్నది ఇంకొక వాగ్దానం. స్కూళ్ల పునఃప్రారంభ తేదీ నుంచే ఇదీ వినవస్తుంటుంది. బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పిస్తామంటూ పథకాలు రచిస్తున్నారు. ఆచరణ పనులు కొనసాగిస్తున్నారు. బడిబాట అనేది అనడానికి, వినడానికి ఇంపుగా ఉంటుంది. వాస్తవానికి ఏం జరుగుతోందన్నది మన కంటికి కనిపిస్తూనే ఉంది.

బడి అంటే అమ్మబడి.. కనుకనే ఏ బిడ్డా ఆకలితో ఉండకూడదని ప్రభుత్వాలు అంటున్నాయి. పోషకాహారం అందించడాన్ని స్కూలు పునఃప్రారంభం నుంచే అమలులోకి తెస్తున్నాయి. ఈ చిత్తశుద్ధి కొనసాగినంతవరకు కావాల్సింది అదే. అప్పుడే లక్ష్యసిద్ధి సుసాధ్యమవుతుంది.



## చిన్నపిల్లల పెద్దభావాలు

సెలవు అంటే ఆటవిడుపు. రోజువారీ పనుల నుంచి విరామం. అనుకూలం అనే పర్యాయపదమూ ఉంది. దేనికి అనుకూలత? విశ్రాంతికి! ఉపయోగం అనే మరో భావమూ సెలవుకు వర్తిస్తుంది. ఏ ఉపయోగం? అప్పటివరకు పెండింగులో ఉంచినవాటిని

సెలవురోజుల్లో పూర్తి చేసుకోవటం అన్నమాట. అంతదాకా చదువులో తలమునకలైన పిల్లలు ఆటలు, ఇతర అభిరుచుల వైపు చూపు మళ్లిస్తారు. బోధనలో నిమగ్నమై ఉండిన ఉపాధ్యాయులు తదితర అంశాల మీద దృష్టి కేంద్రీకరిస్తారు. నిత్యం, నిరంతరం బోధనేతర బాధ్యతలు నిర్వర్తించే సంబంధిత సిబ్బంది ఎండాకాలం సెలవుల్లో హాయిగా ఊపిరి పీల్చుకుంటారు. సమావేశాలూ దైనందిన పాలనా విధులతో సతమతమయ్యే విద్యాశాఖ అధికారులు ఇతరేతర పనుల్లో లీనమవుతారు. బాలల తల్లిదండ్రులు సరేసరి. హాలిడేస్‌ను జాలీడేస్‌గా భావించి ఆటపాటల్లో మునిగి వుండే సంతానాన్ని కళలు, ప్రయాణాల దిశకు తిప్పాలని తహతహలాడుతుంటారు. అందరికన్నా మిన్నగా సెలవులను ఆస్వాదించేది మాత్రం నిస్సందేహంగా విద్యార్థినీ విద్యార్థులే. "ఆడుకో, పాడుకో" అనేలా వాటిల్లోనే రోజులు గడిపేస్తారు. సెలవులన్నీ ముగిసి, తిరిగి బడికి వెళ్లాల్సి వచ్చినపుడు పిల్లల భావోద్వేగాన్ని చూసి తీరాల్సిందే!

ఈ ప్రశ్నలకు సమాధానాలేవి?

"సెలవులు ఎందుకిస్తారు?"

స్కూల్ తెరిచారు కదా! మరిప్పుడు దీన్ని ఫస్ట్ డే అనాలా? సెలవులకు లాస్ట్ డే అనాలా?

ఒక క్లాస్ నుంచి ఇంకో క్లాస్‌కి వచ్చాను. ఇప్పుడే ఈ ఏడాదే పుస్తకాలు మారాయంటున్నారు. ఎందుకు టీచర్?

కొత్త పిల్లలు వస్తారంటున్నారు. ఇన్ని రోజులు వాళ్లెందుకు చదువుకోలేదు సార్? మీరు చేర్చుకోలేదు ఎందుకనీ?

ఇటువంటి ఎన్నో ప్రశ్నలు కొందరు పిల్లల నుంచి వినవస్తాయి.

లోపల అనుకున్నా, పైకే అడిగినా వాటికి బదులివ్వాల్సింది ఉపాధ్యాయులే! స్కూలుకు వచ్చేది చదువుకోడానికి. సెలవులిచ్చేది ఆడుకోడానికి. "చదువులూ, ఆటలూ రెండూ కావాలంటే ఎలా?" అని ఏ పిల్లో, పిల్లవాడో అడిగితే వచ్చే సమాధానమేమిటో?

ఇంట్లో, బయటా, బడిలో కూడా ఏవేవో అడుగుతూనే ఉంటారు బాలలు. వచ్చిన జవాబునే నచ్చేలా చేసుకుంటారు. "పాఠం విన్నారు కదూ, ఏదైనా తెలియకపోతే అడగండి. ఎన్ని సార్లయినా సరే, మీరు బాగా తెలుసుకునేలా చెప్తా" అంటుంటారు టీచర్లు.

ఇటువంటి కొన్ని ప్రశ్నలకు మాత్రం వారేం చెప్పగలరు?

ఎప్పుడైనా ఎక్కడైనా ప్రశ్న వేయడం అనేది బాలబాలికల హక్కు. బదులివ్వడమన్నది ఉపాధ్యాయుల బాధ్యత. అంతకుమించి వృత్తి ధర్మం. ఇన్నాళ్లూ ఇన్నేళ్లూ



అవుతున్నా, ఒక్క ప్రశ్నకు మటుకు సూటి సమాధానం నేటికీ లేదు, రాలేదు.

## సెలవులు ఎందుకిస్తారు?

అవును.., ఏటా ఎందుకిస్తున్నట్లు! ఎప్పటికప్పుడు.. ఎక్కడికక్కడ

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వేసవి సెలవుల షెడ్యూలు దాదాపు ఒకేలా ఉంది. ఏప్రిల్ మూడో వారం తర్వాత మొదలైన సమ్మర్ హాలిడేస్ మే నెల చివరిదాకా కొనసాగాయి. జూన్: రెండో వారందాకా విస్తరించాయి. కొన్ని ప్రాంతాల్లోనైతే సెలవులు పొడిగింపు కూడా. బడులు తిరిగి మొదలైనా మరికొన్ని చోట్ల సందర్భానుసారం వరస సెలవులు సైతం. మొత్తంమీద రమారమి రెండు నెలలు. జూన్ నెల పరంగా సగం రోజులు సెలవుల్లో గడిచినట్లే!

దేశ రాజధాని నగరంలో జులై మొదటి నుంచి బడుల పునః ప్రారంభం.

ఉత్తరప్రదేశ్‌లోనూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మాదిరిగానే. రాజస్థాన్‌లో సెలవులు జూన్ మూడో వారందాకా.

బీహార్, హరియాణా ప్రాంతాల్లో వాతావరణ మార్పు, చేర్పుల ఆధారంగా రూపొందుతాయి సెలవుల అధికారిక ప్రకటనలు. పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక స్థితిగతుల వల్ల వేసవి సెలవులను నిర్ధారించారు. వేడిమి తీవ్రత, ఉక్కపోత కారణంగా పిన్నలూ, పెద్దలూ ఇబ్బందుల పాలవకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు.

దశల వారీగా వేసవి సెలవులను ప్రకటించే విధానం పంజాబ్‌లో అమలవుతోంది. స్థానికం, జిల్లా అధికార యంత్రాంగాలు ఆ మేరకు చర్యలు చేపడుతున్నాయి. ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నాయి. తమిళనాడులోనూ తమదైన పద్ధతిని విద్యాశాఖ అనుసరిస్తోంది. సెలవుల సంబంధంగా ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటోంది. ఇలా దేశంలోని పలు రాష్ట్రాలు పాఠశాలలకు సెలవుల ప్రకటన, పునఃప్రారంభ రీతులను పాటిస్తున్నాయి.

## పుస్తకాలకే తొలి ప్రాధాన్యత

ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలు వేసవి సెలవుల తర్వాత తిరిగి తెరుచుకోగానే?

అధికారులు మొట్టమొదట ప్రాముఖ్యమిచ్చేది పాఠ్య, నోటు పుస్తకాల పూర్తి సరఫరా లక్ష్యానికే.

ప్రభుత్వ, ప్రైవేటు బడులు విద్యా

సంవత్సర ఆరంభంలో కళకళ. ప్రత్యేకించి సర్కారు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ ఉచితంగానే. అందువల్లనే సంబంధిత విద్యాశాఖ యంత్రాంగాలు ఇప్పటికే జిల్లా కేంద్రాల పైన దృష్టి సారించాయి. మండలాల వారీగా రవాణాకు ఏర్పాట్లన్నీ చేశాయి.

బడుల ప్రధాన ఉపాధ్యాయులు బాధ్యత వహిస్తున్నారు. పదో తరగతి వరకు చదువుతున్న పిల్లలందరికీ పుస్తకాలు అందించే కర్తవ్యాన్ని చేపడుతున్నారు. ఏ దశలో ఎటువంటి సమస్య ఎదురైనా గమనించి, పరిశీలించి, పరిష్కరించడానికి పలువురిని బాధ్యులుగా చేస్తున్నారు. వివరాలను ముందుగానే ప్రకటిస్తున్నారు.

విద్యా వత్సర ప్రారంభ తరుణంలోనే పాఠ్య, రాత పుస్తకాలు అందిస్తున్నామని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇప్పటికీ ప్రకటించాయి. పంపిణీ పరంగా గతంలో ఆలస్యం జరిగినందున, ఈసారి అటువంటి ఇబ్బందులు తిరిగి ఏర్పడకుండా చూసుకుంటున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఏ జిల్లాలో ఎన్ని ఉన్నాయో, వాటిల్లో ఎంతమంది అమ్మాయిలు, అబ్బాయిలు చదువుతున్నారో గణాంక వివరాలు వెల్లడిస్తున్నాయి. నిరుడు ఎంత మందికి అందాయో, ఈ ఏడాది ఎందరికి అందుతాయో లెక్కలు చెప్తున్నాయి.

## ఏకరూప దుస్తుల గురించీ..

బాలురకు, బాలికలకు బడిదుస్తులు సరఫరా చేయడమన్నదీ ప్రభుత్వాల లక్ష్యం. ముందుగా ఒక జతను ఒక్కొక్కరికీ అందించి, అటు తర్వాత రెండో జత యూనిఫామ్‌ను ఆగస్టులోగా అందించాలని భావిస్తున్నారు. ఇలా ఏకరూప దుస్తుల తయారీకి కొలతలు తీసుకోవడం, తదుపరి పనులు చేయడాన్ని మహిళా సమాఖ్య సంఘాలకు అప్పగించారు. పర్యవేక్షణ సాగిస్తున్నారు.

పుస్తకాలనీ, స్కూలు డ్రస్‌నీ ప్రత్యేక వాహనాలతో తరలించే పని ఇంకా జరగాల్సి ఉంటుంది. అది ఎక్కడ ఎంత శాతం పూర్తయిందో తెలుసుకునేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామంటున్నారు ఉన్నత స్థాయి అధికారులు. రాష్ట్రంలోని ఏ జిల్లాకు ఎన్ని కావాలి, ఇప్పటికి వచ్చినవి, రావాల్సినవి ఎన్నెన్ని అని ఆరాలు తీస్తున్నారు.

రావాల్సి వున్నవాటి కోసం ఎదురు




చూసే పరిస్థితులు ఉండకూడదు. మాకు అందనేలేదన్న ఫిర్యాదులు ఎక్కడా వినిపించరాదన్నది విద్యాశాఖ అభిమతం. అదొక్కటీ ఉంటే సరిపోదు. “ఆలోచన, ఆచరణ మధ్య పొంతన అంటూ తప్పనిసరి..” ఇదీ ఉపాధ్యాయ సంఘాల వాణి. ఎవరి స్థాయిలో వారు నిబద్ధతగా పని చేస్తే పిల్లల ఆశలన్నింటినీ నెరవేరినట్లే!

విద్యార్థినీ విద్యార్థులకు కావాల్సిన వాటిని బడులు తెరిచిన తదుపరి కాదు; ముందే అందిస్తామని గంభీర ప్రకటనలు చేశాయి ప్రభుత్వాలెన్నో. ఆ వాగ్దానాలు ఆచరణ రూపానికి ఏ మేరకు వచ్చాయన్నది పిల్లల తల్లిదండ్రులకైతే మరింత బాగా తెలుస్తుంది.

## పాఠశాల అంటే!

స్కూలు అంటే కేవలం భవనం కాదు. తరగతి గది అనేది గోడలకు పరిమితం అసలే కాదు, అస్సలు కాకూడదు. అమ్మఒడి ఎంతో, నాన్న కౌగిలి ఎంతో, బడి కూడా అంతే! బడి, బడి. పిల్లలకు కావాల్సింది వాళ్లు కోరుకునేది ఇదే!

పాఠశాల.. పిల్లల పాలిట సర్వం, సకలం, సమస్తం. తోటి బాలలతో స్నేహం, గురువులంటే వినయం. వీటికి మూలం, కీలకం తరగతి గది. దీనిలోనే అన్ని ఆశలూ, ఆశయాలూ, చిన్ని చిన్ని అనుభవాలూ. నేర్చుకున్న వాటినే ఇంటికెళ్లి అమ్మా నాన్నతో పంచుకుంటారు. ఇంట్లో, బడిలో వాతావరణం ఎంత బాగుంటే, బాలబాలికల జీవితమూ అంత బాగా పరిమళిస్తుంది. కాబట్టే, చూపులన్నీ బడివైపు ఎప్పుడూ.

బాలల తలరాతలు మార్చేది తరగతి గదే అంటారు. ఆ చిట్టి శిలలను చక్కటి శిల్పాలుగా మలచేది పాఠాలు చెప్పే గురువులే! అంతటి కృతజ్ఞతా భావంతోనే శిష్యులు ఎంతటి ఉన్నత స్థాయికి చేరినా ఏరికోరి మరీ గురు బ్రహ్మల దరిచేరి తల వంచి నమస్కరిస్తారు. పాదాలకు మొక్కి, దీవెనలు అందుకుంటారు మనసారా. కలయో, పుస్తకమో మార్పు తెచ్చినట్లు ఉపాధ్యాయ స్వరమూ మంచిని ప్రసరిస్తుంది.. ప్రవహింపచేస్తుంది.

గురువులు మార్చిన బడులూ ఎన్నో ఉన్నాయి. వివిధ కారణాలతో చేరికలు తగ్గిన విద్యార్థుల శాతాన్ని స్వయంకృషితో పెంచిన వారున్నారు. సొంత డబ్బులతో పాఠశాల నిర్మాణ, నిర్వహణ పనులకు తోడూ, నీడగా నిలిచినవారూ ఎందరో ఉన్నారు. ఉదహరించాలేగానీ ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణలో, ఇతర రాష్ట్రాల్లోనూ అనేకం.

### అక్షర శక్తి

అక్షరమే లోకానికి రక్షణ, పరిపోషణ

‘అక్షరశాల’ బాలలకు వరం ఈ ఇల

బడిలో గంట, తరగతిలో బల్ల!

చదువుల తోటలో సీతాకోకచిలుకలు పిల్లలు

వెలుగుపూలను పంచే తెలుగు తేజాలు!

# ఒంటరితనాన్ని ఓడిద్దాం!

ఒంటరితనం ఓ మానసిక భావోద్వేగ ప్రక్రియ. కొందరికి ఒంటరితనం లేదా ఏకాంతం ఓ అద్భుత అవకాశంగా నిలిస్తే మరి కొందరిలో ఒంటరితనం ఓ అవాంఛనీయ అనారోగ్యకర సమస్యగా నిలుస్తున్నది. దాదాపు యాభై శాతం జనాభా అంతర్ముఖులుగా ఒంటరితనాన్ని కోరుకుంటారు, అనారోగ్యాల బారిన పడతారు.

కొందరికి ఒంటరితనం వరమయితే మరికొందరికి అది శాపంగా మారుతోంది. పరిమిత ఒంటరితనం శారీరక, మానసిక వికాసానికి, సానుకూల భావనలు జనించడానికి దోహదపడుతుంది. మితిమీరిన ఒంటరితనం ప్రమాదకరంగా మారి చివరికి ప్రాణాంతకం కూడా మారుతుంది. ఒంటరితనాన్ని మనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తే అది వ్యక్తి సంపూర్ణ శ్రేయస్సుకు ఉపకరిస్తుంది. ఒంటరితనానికి, ఏకాంతవాసానికి తేడా ఉన్నది. ఒంటరితనం అనేది ఒక భావోద్వేగ ప్రతికూల స్థితి. తాను ఇతరులతో కనెక్ట్ కావాలని కోరుకున్నప్పటికీ, తన చుట్టు ఎవరూ లేరని భావించడాన్ని ఒంటరితనం అనవచ్చు. ఏకాంతం అనేది ఒక వ్యక్తి కావాలని ఒంటరిగా ఉండడం, తమ చుట్టుపక్కలకు దూరంగా ఉంటూ ఆలోచనలు చేయడం అని అర్థం చేసుకోవాలి. ఏకాంతం అనేది ఒక ఆశావహ ప్రయోజనకర మానసిక స్థితి. ఒంటరితనం అనేది రుగ్మతగా మారితే అత్యంత ప్రమాదకరం అవుతుంది.

నిశ్శబ్ద రుగ్మతగా సమాజంలో వ్యాపిస్తున్న ఒంటరితనాన్ని ఒక దురాచారంగా లేదా ప్రతిష్టకు మచ్చగా భావిస్తున్న వేళ దాని పట్ల అవగాహన కల్పించడం తప్పనిసరి. దీర్ఘకాలం పాటు ఒంటరితనాన్ని అనుభవించిన వారిలో తీవ్రమైన అనారోగ్యాలు కలుగుతాయి. ఒంటరితనం హద్దులు మీరితే మతిమరుపు, హృదయనాళ అనారోగ్య సమస్యలు, స్ట్రోక్, నిరాశ, ఆందోళన, అకాల మరణాలు, అలసట, ఆత్మన్యూనత భావం, మానసిక ఒత్తిడి లాంటి అనారోగ్యాలు కలుగుతాయి.

ఒంటరితనం ఫలితంగా శారీరక, మానసిక, భావోద్వేగ, సామాజిక ప్రతికూలతలతో పాటు మానవ సంబంధాల సమస్యలు ఉత్పన్నం అవుతాయి.



కొందరు వ్యక్తుల్లో ఒంటరితనం/ ఏకాంతవాసం పలు ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. వ్యక్తిగత ఎదుగుదల, ఆత్మ విమర్శ చేసుకునే అవకాశం, గత లోపాలను సరిదిద్దుకునే ఆలోచనలు, రేపటి ప్రణాళికల రచనలు, తనలోని బలాలు/ బలహీనతలను విశ్లేషించుకునే సదవకాశం, లక్ష్యసాధన మార్గాల అన్వేషణలు, తన గురించి తాను ఆలోచించుకోవడం, సృజనశీల ఆలోచనలు, ఉత్పత్తికి ఊతం, ఏకాగ్రత పెరుగుదల, ఇతరుల ప్రభావాలకు దూరంగా స్వతంత్ర భావాలకు పట్టం కట్టడం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సమతుల సామాజిక సంబంధాల్లో ప్రగతి, ఆత్మ విమర్శకు అవకాశం, విశ్రాంతి దొరకడంతో రేపటికి శక్తిని కూడగట్టుకోవడం లాంటి అనేక ప్రయోజనాలు ఒంటరితనానికి లేదా ఏకాంతవాసానికి ఉంటాయి.

ఒంటరితనాన్ని ఓడించి చురుకుగా, సరదాగా సమాజంతో మమేకం అవుతూ జీవితాన్ని ఆస్వాదించడానికి కొని చిట్కాలను తెలుసుకోవాలి. మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులతో కలివిడిగా ఉండాలి. చొరవ తీసుకొని ఇతరులతో మాట్లాడడం, మన అభిరుచులకు తగిన బంధువులు, మిత్రులతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికల్లో పాల్గొనడం మంచిది. ఇష్టమైన పనులను చేసి ఆనందాన్ని పొందడం, మన భావాలను దగ్గరి వారితో పంచుకోవడం/ పరిష్కార మార్గాలను తెలుసుకోవడం, ఒంటరిగా/ ముభావంగా ఉండే వారికి దగ్గర కావడం లాంటి చర్యలు ఒంటరితనమనే రుగ్మతను దూరం చేస్తాయి. ఒంటరితనాన్ని పరిమితం చేస్తూ, పౌర సమాజంతో దగ్గరవుతూ, సంతోష సాగరంలో మునుగుతూ, జీవితాన్ని సుసంపన్నం చేసుకుంటూ, ఎంపిక చేసుకున్న లక్ష్యాలను అధిగమిస్తూ, అందరి మన్ననలు పొందుతూ, చలాకీగా ప్రవర్తిస్తూ ఆయురారోగ్యాలతో జీవితాంతం ఆనందంగా ఉందాం, ఆనందాన్ని పంచుదాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

# నువ్వే ఓ విప్లవ తారవై!

అపజయాల మెరుపుల పిడుగు గర్జనలు
అలుపెరగక నీపై అవిశ్రాంత యుద్ధం
ప్రకటిస్తున్నా సరే...
నీ సంకల్ప సమర గళం సాక్షిగా విప్లవతారవై
నీ జీవనాకాశాన కొత్త రంగుల
ఇంద్రధనస్సులకు ప్రాణం పోసేయ్..!
నువ్వే అనంత గణిత
లేజర్ కాంతి దివ్వెల
సమూహమై
నువ్వే అనితర సాధ్యం
మహిమాన్విత
కావ్యాల సందేశమై
నువ్వే అసామాన్య వ్యక్తిత్వ వికాస
స్ఫూర్తి ప్రవాహ సంద్రాల కెరటమై
నువ్వే నవ శంఖారావ శబ్దాల
దిక్సూచి గుండె సంబరమై
నీ ప్రతీ అడుగు ఓ అక్షర జ్వాలై
విజయ శిఖరాల చైతన్య గీతికలను రచిస్తుంటే
కాలం గుండె రగిలి అనుభవాల కలమై
విశ్వ కాగితాలపై నీ ముఖచిత్ర సంతకం చేయాలి
కోటి నక్షత్రాల వెలుగై
నీ సత్యపు ఆత్మవిశ్వాసం ప్రభవిస్తుంటే
శతాబ్దాలుగా కోట్లాది ప్రజానీకానికి
నువ్వే అరుణోదయ గమన
సూత్రానివై
అనునిత్యం ప్రేమ శాంతి దోలనాల
మీదుగా
పరిభ్రమిస్తూ ప్రకాశిస్తూ
పరిశోధిస్తూ పరితపిస్తూ
కవన జ్వలిత గ్రహమై.. గర్భమై..
నువ్వే ఓ సృష్టి కర్త..!

– ఫిజిక్స్ అరుణ్ కుమార్

## ఈ వారం కవిత్వం

# అక్షర సుమాలు

నిద్ర లేవగానే
పెరట్లోంచి రంగుల పూలు
గుడ్ మార్నింగ్ చెప్పాయి
అనుభూతి
అక్షరాలనద్దుకుంది ...
క్షణాల్లో కవితా సుమం
కాగితంపై మొలిచింది
ఎవరు పిలిచారో!
సీతాకోకను...
గదిలోకొచ్చి కవిత రాసిన
కాగితంపై వాలింది
ప్రతి అక్షరాన్ని ముద్దాడి
రెక్కలాడిస్తూ వెళ్ళిపోయింది
ఆశ్చర్యం!
కాగితంపై రాసిన అక్షరాలన్నీ...
పూలై పరిమళించాయి.

– రేఖా రామానుజన్



# రౌడీ




టప్పు టప్పు నిప్పులు రాలుతున్నాయి
బండల గుండెలు పగులుతున్నాయి
భూమి ఆకాశాల నడుమ
కొర్రాయి భగ భగ మండుతున్నది
తల దాచుకునే నీడ లేక తరులు
చతికిలపడుతున్నాయి
ఎండ కొరడా ఝుళిపిస్తున్నది
కాలు బయట పెడితే పనిష్మెంట్
అన్నట్టు..
సురుకు వాత పెడుతున్నది
ఎక్కాలు చదువని పిల్లవాని
కాళ్ళూ చేతులు
బెత్తంతో చప్పరించినట్టు
నెత్తీనొసలూ వీపూ గీపూ చూడకుండా
మద్దెల వాయిస్తున్నది
గడప దాటితే శరీరం
పెనం మీది రొట్టెలా మాడిపోతున్నది
కాస్త పూల నవ్వులు చూద్దామని
అలా విహార యాత్రకు బయలుదేరితే
ఆశలు ఆవిరయితున్నాయి.
ఎంతో మంది సుకుమార
సుందరీమణులు.. గువ్వపిల్లల్లా
చలువ గూటిలో ఒదిగిపోయినట్టు
కొమ్మ మీది పువ్వులు కూడా
హరిత పత్రాల ఛత్రీల చాటుకు
ముడుచుకున్నాయి.
ఏమెండ.. మనసు లేని ఎండ
చాకు లేదు గీకు లేదు
కంటి చూపుతో చంపుతున్నది.

– గజ్జెల రామకృష్ణ

# సాఫల్య తీరాలు

సమయం ప్రవహిస్తూనే..
అందరికీ సమాన అవకాశాల్ని..
వడ్డిస్తూ జారిపోతుంది..
టైమ్‌తో నడిచినవారు..
సాఫల్య తీరాలు చేరతారు!

భాగ్యం ఓ భ్రమణ మాయ..
ఎక్కడ స్థిరంగా నిలబడదు..
నిరుపేదను హీరోగా..
హీరోను జీరోగా మార్చి..
తన సత్తా చాటుతుంది !

కర్మ వ్యక్తి చేతిలో..
ఓ అద్భుత అవకాశం
కర్మ చేస్తే భాగ్యం విరిస్తుంది
కాలంతో వేగంగా కదిలే..
ధీరున్ని కర్మ విజేతగా నిలుపుతుంది!

సమయ సద్వినియోగం
కర్మను సదా శ్వాసించడం
కాల కర్మల జోడీ ప్రయాణంలో..
భాగ్యం తోడు కావడం నిక్కం
కాలం సాక్షిగా కర్మ చేద్దాం నేస్తం !

– మధుపాళీ

సింగిల్ పేజీ కథ

# తండ్రితనపు వెలుగు

సీతారామపురంలో నివసించే రామచంద్రయ్యకు గుండెల్లో ఘనత నిండిన వ్యక్తిత్వం. కళ్లలో నిజాయితీ, చేతుల్లో శ్రమ, మాటల్లో సానుభూతి తెలియాడేవి. అతని జీవితం ఒక నిరంతర పోరాటం. వనమార్గంలో నడిచినట్లుగా సాగిన జీవనయాత్రలో తోడుగా నడిచింది రమాదేవి. ఒకరు మాట్లాడిన మాటకు మరొకరు మన్ననినిచ్చే సహనం ఉంది. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు.. రాజా, సంధ్య. రాజా నిశ్శబ్దాన్ని ఇష్టపడేవాడు, తల్లిదండ్రుల పట్ల గౌరవంతో ఎదిగిన కుర్రాడు. సంధ్య మాత్రం సూర్యకిరణంలా నవ్వే స్వభావం.

అయితే రామచంద్రయ్య మనసులో ఓ మూల అంతులేని శూన్యత తాపత్రయంగా ఉండేది. ఆ భావనను మాటలుగా వ్యక్తం చేయడు. కానీ కళ్లలో ఆ ఆవేదన స్పష్టంగా కనిపించేది. ప్రతిరోజూ ఆఫీసు నుండి తిరిగే మార్గంలో గాజులవారి వీధిలోని బాలసదన్ అనాథాశ్రమం గుండా వెళుతుంటే, అక్కడ గేటు వద్ద ఓ చిన్నపాప కనిపించేది. చేతుల్లో మట్టి, కళ్లలో ఆశ. ఆ చూపుల్లో ఎదురు చూపు, ఆ కళ్ళల్లో ఓ ప్రశ్న.

ఆ పాపను చూసిన ప్రతిసారి హృదయం తడిచేది. ఆ పాపను మనసులో 'చిట్టితల్లి'గా అనుకుని, మౌనంగా మాట్లాడుకునేవాడు. చేతులు చాపి ఎత్తుకునే ధైర్యం కలగదు. కానీ చిన్న కళ్ళలో ఎప్పుడూ గొప్ప కలల వెలుగు. ఒకరోజు రమాదేవితో ఆ భావనను పంచుకున్నాడు. "మనకి ఇద్దరు పిల్లలు ఉన్నా సరే, ఓ చిన్నపాపకి తల్లిదండ్రులం కావచ్చుగా?" అంటే రమాదేవి మౌనంగా తల ఊపింది.



కొన్ని రోజుల తర్వాత బాలసదన్‌కు వెళ్లారు. నెమ్మదిగా మాట్లాడి ఆ చిన్నపాపను ఇంటికి తీసుకొచ్చారు. చిన్న చేతులు చాపి, పెద్ద ఆశలతో నిలబడి ఉంది. రమాదేవి ఆమెను ఒడిలోకి తీసుకున్న వేళ ఆమె ఒక్క చిలిపి నవ్వుతో కుటుంబమంతా వెలిగిపోయింది. 'దీపిక' అనే పేరు పెట్టారు.

ఇంటికి తీసుకొచ్చినప్పుడు రాజా, సంధ్య అసమంజసంగా చూసారు. మొదట రాజా చింతించినా, దీపిక చేతి తాకిడితో గుండె తలకిందులైంది. సంధ్య నడుం బిగించి పాత పుస్తకాన్ని తీసి "ఇది నీది చెల్లెలూ" అంటూ చేతిలో పెట్టిన దృశ్యం, కుటుంబాన్ని మరోసారి ఒకటిగా కట్టిపడేసింది. ఆ రోజు ఇంట్లో కొత్త వంట వాసన, గదుల్లో నవ్వుల హోరు.. రామచంద్రయ్య కూర్చున్న కుర్చీలో దీపిక ఎక్కి కూర్చునేది. రమాదేవి చేతుల్లో తీయని ముద్దుగా మారింది. అక్షరాల నేర్పు కోసం పాత పుస్తకాలను తీసి రామచంద్రయ్య మొదటి పాఠాలు మొదలెట్టాడు. అ, ఆ, ఇ, ఈలాగా మళ్లీ ఒక జీవితం ప్రారంభమైంది.

"నాన్నా" అని పిలిచిన తొలి రోజు గాజులగిన్నె కన్నీటితో నిండినట్లు గుండె ఉప్పొంగిపోయింది. ఆ పిలుపే జీవితమంతా అందించిన గౌరవంగా నిలిచింది. ముఖంలో వృద్ధాప్యం మాయమై, గుండెల్లో వెలుగు పరవళ్లు తొక్కింది. ఈ సంగతులు ఊరిలో చర్చగా మారాయి. మొదట ఆశ్చర్యం, తర్వాత ఆలోచన, ఆ తరువాత మార్పు. మరికొన్ని కుటుంబాలు బాలసదన్‌కి వెళ్లి పిల్లల్ని ప్రేమతో ఆలింగనం చేసుకున్నాయి. చిన్నారుల కళ్ళల్లో ఆశ కొత్త రంగులు పూయించింది. ఒక్క కుటుంబం మారితే ఊరంతా మారుతుందనే అర్థం క్రమంగా అందరికీ స్పష్టమైంది.

ఆ తోట కుర్చీలో కూర్చుని రామచంద్రయ్య ఆలోచించేవాడు కోట్లు సంపాదించలేదు, కానీ ఓ నవ్వు సంపాదించాడు. అది చాలు. "నన్ను నాన్నా అని పిలిచిన ఓ చిన్నారి నాకు దేవతగా అనిపించింది" అన్న మాట, అతని జీవన గాథకు నిజమైన నిర్వచనం.

దీపిక పెరిగింది. చదువులో ప్రథమ స్థానం సాధించింది. కథలు రాయడం మొదలెట్టింది. తండ్రి ప్రతీ కథలో తన నీడను చూసేవాడు. ప్రతి కథలో ఓ తండ్రి పాత్ర, ఆ పాత్రలో పరమ ప్రేమ – ఇవి తన ఇంట్లో పుట్టిన వెలుగులే అనిపించేవి.

ఒకరోజు స్కూల్ స్టేజీపై దీపిక మాట్లాడుతూ, "నన్ను కన్నవాళ్లకన్నా మన్నవాళ్లు గొప్పవాళ్లు. ప్రేమించే ఒక్క చూపే నాకు కొత్త జీవితం ఇచ్చింది" అన్నప్పుడు ప్రేక్షకులు నిలబడి చప్పట్లు కొట్టారు. చిన్న పిల్లల మనసుల్లో ఆ మాటలు చిరస్థాయిగా నిలిచిపోయాయి.

ఆ రాత్రి రమాదేవి ప్రశ్నించింది – "మనం నిజంగా గొప్ప పని చేసామా రామా?"

అతను నవ్వుతూ తల ఊపి చెప్పాడు "ఓ చిన్నారి నవ్వాలని నేర్పించాం రమా.. అంతకంటే గొప్ప పని ఇంకేముంటుంది?" ఆ ఇద్దరి కళ్లలో చిన్న వెలుగు మెరుస్తూ, కుటుంబమంతా వెలిగించిన వెలుగు కథగా మారింది.

ఇది ఒక కథ కాదు... ఒక నిశ్శబ్ద వెలుగు. ఓ తండ్రి గుండె తాకిన ఓ చిరునవ్వు. దీపిక ఇచ్చిన ముద్దు, రాజా అందుకున్న సమర్థత, సంధ్య ఇచ్చిన స్నేహం– ఇవన్నీ కలిసిన జీవితం. ప్రేమకి ముగింపు ఉండదు కనుక, ఈ కథకు ముగింపు లేదు.

– డా॥ చిటికెన కిరణ్‌కుమార్



# ధైర్యాన్ని నేర్పే భాష

పిల్లలకు భాషను నేర్పడం అంటే కేవలం అక్షరాలను పరిచయం చేయడం కాదు. పదాలను పలకడం, వాక్యాలను రాయించడం, పరీక్షల్లో మార్కులు సాధించడం మాత్రమే భాషా విద్య లక్ష్యం కాదు. నిజమైన భాషా విద్య అంటే పిల్లలలో ఆలోచనలను స్పష్టంగా వ్యక్తపరిచే ధైర్యాన్ని పెంపొందించడం. వారి భావాలను, సందేహాలను, కలలను, అభిప్రాయాలను భయపడకుండా చెప్పగల శక్తిని ఇవ్వడం. ఎందుకంటే భాష అనేది కేవలం మాటల సమాహారం కాదు అది మనసుకు అద్దం, వ్యక్తిత్వానికి పునాది, సమాజంతో మనిషిని కలిపే జీవంతమైన వంతెన.

ఈ రోజుల్లో విద్యా వ్యవస్థలో ఎక్కువగా మార్కులపైనే దృష్టి కేంద్రీకృతమవుతోంది. పిల్లలు వ్యాకరణ నియమాలను కంఠస్థం చేస్తున్నారు, వ్యాసాలను బట్టీ పట్టి రాస్తున్నారు, పరీక్షల్లో మంచి ఫలితాలు తెస్తున్నారు. కానీ తమ భావాలను స్వేచ్ఛగా చెప్పగలుగుతున్నారా? "నాకు ఇది నచ్చలేదు", "నాకు ఈ విషయం అర్థం కాలేదు", "నాకు ఒక కొత్త ఆలోచన ఉంది" అని ధైర్యంగా మాట్లాడగలుగుతున్నారా? అనే ప్రశ్నకు సమాధానం చాలాసార్లు నిరాశాజనకంగానే ఉంటుంది. భాష అంటే కేవలం పాఠ్యపుస్తకాల్లోని పాఠాలు కాదు. అది ఒక పిల్లవాడి అంతరంగాన్ని వెలికి తీసే సాధనం. పిల్లలు తమ భావాలను వ్యక్తపరచలేకపోతే, వారి ఆత్మవిశ్వాసం క్రమంగా తగ్గిపోతుంది. వారు మౌనంగా మారిపోతారు. కొంతమంది పిల్లలు తెలివైనవారైనా, మాట్లాడే అవకాశం లేకపోవడం వల్ల వెనుకబడిపోతారు. అందుకే భాషా బోధనలో భావ వ్యక్తీకరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి.

ఇంటి వాతావరణం నుంచే ఈ మార్పు ప్రారంభం కావాలి. చాలా కుటుంబాల్లో పిల్లలు ప్రశ్నలు అడిగితే "మౌనంగా ఉండు", "పెద్దలు మాట్లాడుతున్నప్పుడు మాట్లాడకూడదు" అనే సమాధానాలు వినిపిస్తుంటాయి. దీనివల్ల పిల్లల్లో భయం పెరుగుతుంది. తమ అభిప్రాయాన్ని చెప్పడం తప్పు అనే భావన కలుగుతుంది. కానీ పిల్లల ప్రశ్నలను ప్రోత్సహించినప్పుడు, వారు ఆలోచించడం నేర్చుకుంటారు. భాషను ఉపయోగించడం ద్వారా తమ వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటారు.

పాఠశాలల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కొన్నిసార్లు ఉపాధ్యాయుల పాత్ర బోధనకే పరిమితమవుతోంది. పిల్లలు పుస్తకంలోని సమాధానాలను మాత్రమే చెప్పాలని ఆశిస్తున్నారు. కానీ విద్య అంటే కేవలం సరైన సమాధానం చెప్పడం కాదు; కొత్త ప్రశ్నలు అడగడం కూడా. పిల్లల ఊహాశక్తికి, అభిప్రాయాలకు విలువ ఇచ్చినప్పుడే నిజమైన విద్య ప్రారంభమవుతుంది.

ఒక చిన్నారి కథ చెప్పేటప్పుడు, తన అనుభవాన్ని పంచుకునేటప్పుడు, వేదికపై మాట్లాడేటప్పుడు అతని భాష మాత్రమే కాదు.. అతని ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది. ఇదే భవిష్యత్తులో నాయకత్వ లక్షణాలకు పునాది అవుతుంది. ఎందుకంటే సమాజంలో ముందుకు వెళ్లేది కేవలం చదువు తెలిసినవాడు కాదు; తన ఆలోచనను స్పష్టంగా చెప్పగలిగినవాడు.

ప్రస్తుతం డిజిటల్ యుగంలో పిల్లలు ఎక్కువగా మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాతో మమేకమవుతున్నారు. సమాచారాన్ని వేగంగా స్వీకరిస్తున్నారు కానీ తమ భావాలను లోతుగా వ్యక్తపరచే అలవాటు తగ్గుతోంది. చిన్న చిన్న సందేశాలకే పరిమితమవుతున్న సంభాషణలు, పిల్లలలో భాషా లోతును తగ్గిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పుస్తక పఠనం, చర్చలు, కథా రచన, వేదికలపై ప్రసంగాలు వంటి కార్యక్రమాలు అత్యంత అవసరం.

భాష పిల్లలకు కేవలం ఉద్యోగ అవకాశాల కోసం అవసరమైన నైపుణ్యం కాదు.అది వారి మనసును నిర్మించే శక్తి. ఒక పిల్లవాడు తన బాధను, ఆనందాన్ని, ఆశలను మాటల్లో పెట్టగలిగితే అతడు మానసికంగా బలంగా ఎదుగుతాడు. తన అభిప్రాయాన్ని గౌరవంగా చెప్పగలిగితే అతడు సమాజంలో బాధ్యతగల పౌరుడిగా మారుతాడు.

మన దేశ చరిత్రలో గొప్ప నాయకులు, రచయితలు, సంస్కర్తలు అందరూ తమ భావ వ్యక్తీకరణ ద్వారానే ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. వారి వద్ద ఉన్న అసలు బలం భాష. అది కేవలం పదాల అందం కాదు; ఆలోచనల స్పష్టత, మనసులోని నిజాయితీ. అదే శక్తిని మన పిల్లలకు ఇవ్వాల్సిన అవసరం ఉంది. కాబట్టి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యా విధాన రూపకర్తలు కలిసి భాషా బోధనను కొత్త కోణంలో చూడాలి. పిల్లలు తప్పులు చేసినా మాట్లాడేందుకు ప్రోత్సహించాలి. వారి అభిప్రాయాలను వినాలి. భాషను భయపెట్టే అంశంగా కాకుండా, భావాలను వ్యక్తపరిచే స్నేహితుడిగా పరిచయం చేయాలి. ఎందుకంటే భాష కేవలం మాటలు కాదు. అది మనిషి ఆత్మకు స్వరం. పిల్లలకు భాష నేర్పడం అంటే వారికి అక్షరాలు ఇవ్వడం కాదు.. తమ మనసును ధైర్యంగా ప్రపంచానికి వినిపించే శక్తిని అందించడం. అదే నిజమైన విద్య, అదే సమాజ అభివృద్ధికి పునాది.

– తిప్పర్తి శ్రీనివాస్

గుమ్మడి గింజలు పరిమాణంలో చిన్నవిగా ఉన్నప్పటికీ, వీటిలో శరీరానికి అవసరమైన పోషకాలు, విటమిన్లు ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటిని రోజూ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు: గుమ్మడి గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు, మెగ్నీషియం, జింక్ ఫ్యాటీ యాసిడ్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తపోటును నియంత్రించడంలో, చెడు సామర్థ్యాన్ని పెంచుతుంది. గుమ్మడి గింజలు అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లతో నిండిన ఒక శక్తివంతమైన పోషక నిధి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. మెగ్నీషియం, జింక్, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉండే ఈ గింజలు గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి, రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను

# సూపర్ ఫుడ్.. గుమ్మడి గింజలు

కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. వీటిలో ఉండే అధిక జింక్, విటమిన్‌ని శరీరంలో రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఇవి ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా శరీరాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. రాత్రి నిద్రలేమితో బాధపడేవారికి గుమ్మడి గింజలు ఒక అద్భుతమైన ఔషధం. వీటిలో ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ ఉంటుంది. ఇది శరీరంలో సెరటోనిన్ మెలటోనిన్‌లుగా మారి, ప్రశాంతమైన, గాఢమైన నిద్ర రావడానికి దోహదపడుతుంది. గుమ్మడి గింజల్లో మెగ్నీషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది.

ఈ గింజల్లో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఇది మంచి ఉపశమనాన్ని ఇస్తుంది. గుమ్మడి గింజలు పురుషులలో ప్రొస్టేట్ గ్రంథి ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిలోని జింక్ కంటెంట్ ప్రొస్టేట్ వాపు సమస్యలను తగ్గించడమే కాకుండా, పురుషులలో సంతానోత్పత్తి సమతుల్యంగా ఉంచడంలో సహాయపడతాయి. వీటిలోని అధిక ఫైబర్ జీర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుంది, అదే సమయంలో ట్రిప్టోఫాన్ ఉండటం వల్ల నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది.

అదనంగా, గుమ్మడి గింజలలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి, ఇవి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించగలవు. ఆహారంలో గుమ్మడి గింజలను చేర్చుకోవడం ద్వారా శక్తిని పెంచుకోవడానికి, ఎముకల ఆరోగ్యానికి మానసిక స్పష్టతను మెరుగుపరచుకోవడానికి ఇది ఒక సహజమైన మార్గాన్ని అందిస్తుంది. అందువల్ల ఇవి రోజువారీ పోషణకు సూపర్ ఫుడ్‌గా నిలుస్తాయి.

పెపిటాస్ అని కూడా పిలువబడే గుమ్మడి గింజలు, ఉత్తర అమెరికాకు చెందిన 'కుకుర్బిటా పెపో' అనే జాతి గుమ్మడికాయ పండు నుండి వస్తాయి. వేల సంవత్సరాలుగా సాగు చేస్తున్నారు. ఈ చిన్న, చదునైన గింజలు తెల్లటి పొరలో కప్పబడి ఉంటాయి. ఘాటైన రుచిని కలిగి ఉంటాయి. పోషక విలువల పరంగా, గుమ్మడి గింజలు ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ మెగ్నీషియం, జింక్, ఐరన్ వంటి అవసరమైన ఖనిజ, శక్తి కేంద్రాలుగా పనిచేస్తాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్లు మొక్కల ఆధారిత ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లకు కూడా మంచి మూలం. సాంప్రదాయకంగా, గుమ్మడి గింజలను వివిధ సంస్కృతులలో వాటి ఔషధ గుణాల కోసం ఉపయోగిస్తున్నారు. ఇవి ప్రొస్టేట్ ఆరోగ్యానికి తోడ్పడతాయని, గుండె పనితీరును మెరుగుపరుస్తాయని జీర్ణక్రియకు సహాయపడతాయని నమ్ముతారు.



తరచుగా వేయించి లేదా పచ్చిగా తినే గుమ్మడి గింజలు ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రసిద్ధ చిరుతిండిగా, వంటకాలలో ఒక పదార్థంగా ఉన్నాయి. వాటి రుచి ఆరోగ్య ప్రయోజనాల కోసం వీటిని ఎంతో విలువైనవిగా భావిస్తారు ప్రతిఒక్కరూ.

గుమ్మడి గింజలలో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. శరీరం దీనిని సెరోటోనిన్, మెలటోనిన్‌గా మారుస్తుంది. ఈ హార్మోన్లు నిద్రను నియంత్రించడంలో సహాయపడతాయి. గుమ్మడి గింజలలోని మెగ్నీషియం కండరాలను సడలించి, నాడీ వ్యవస్థను ప్రశాంతపరచి, ప్రశాంతమైన నిరంతరాయమైన నిద్రను ప్రోత్సహిస్తుంది. సాయంత్రపు చిరుతిండిలో గుమ్మడి గింజలను చేర్చుకోవడం వల్ల నిద్రలేమి లేదా క్రమరహిత నిద్ర సమస్యలతో బాధపడేవారికి సహాయపడుతుంది. మంచి నిద్ర అభిజ్ఞాత్మక పనితీరుకు, మానసిక స్థితికి మొత్తం ఆరోగ్యానికి తోడ్పడుతుంది.

గుమ్మడి గింజలు దృఢమైన, ఆరోగ్యకరమైన ఎముకలను కాపాడుకోవడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. గుమ్మడి గింజలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆస్టియోపోరోసిస్ వంటి ఎముక సంబంధిత రుగ్మతలను నివారించవచ్చు. ముఖ్యంగా వృద్ధులలో ఎముకలు విరిగే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. వాటిలోని పోషకాలు అస్థిపంజర బలానికి దీర్ఘాయువుకు తోడ్పడతాయి. ఈ గింజలలో రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడే గుణాలు ఉన్నాయి, అందువల్ల ఇవి మధుమేహం లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిలో అధికంగా ఉండే మెగ్నీషియం ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరుస్తుంది, దీనివల్ల కణాలు గ్లూకోజ్‌ను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకోగలుగుతాయి. అంతేకాకుండా, గుమ్మడి గింజలలోని ఫైబర్ ప్రోటీన్ రక్తప్రవాహంలోకి చక్కెర శోషణను నెమ్మదింపజేసి, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నివారిస్తాయి. భోజనంలో లేదా చిరుతిళ్లలో గుమ్మడి గింజలను చేర్చుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను మెరుగ్గా నియంత్రించుకోవడానికి జీవక్రియ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి దోహదపడుతుంది. గుమ్మడి



గింజలలోని పీచుపదార్థం మలానికి బలాన్ని చేకూర్చి, క్రమమైన పేగు కదలికలకు సహాయపడటం ద్వారా ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. పీచుపదార్థం పేగులోని ప్రయోజనకరమైన బ్యాక్టీరియాకు ఆహారాన్ని అందించి, సమతుల్య మైక్రోబయోమ్‌కు, పోషకాల శోషణను మెరుగుపరచడానికి దోహదపడుతుంది. అంతేకాకుండా, గుమ్మడి గింజలలో యాంటీ ఆక్సిడెంట్లు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ సమ్మేళనాలు ఉంటాయి, ఇవి జీర్ణవ్యవస్థను చికాకు నష్టం నుండి కాపాడగలవు. గుమ్మడి గింజలను తినడం వల్ల మొత్తం జీర్ణక్రియ పనితీరు మెరుగుపడుతుంది. మలబద్ధకం, ఇతర జీర్ణ సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. గుమ్మడి గింజలలో విటమిన్ ఇ, కెరోటినాయిడ్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి శరీరంలోని హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించడంలో సహాయపడతాయి.

ఫ్రీ రాడికల్స్ ఆక్సీకరణ ఒత్తిడిని కలిగించి, కణ నష్టానికి దారితీస్తాయి, క్యాన్సర్, వృద్ధాప్య సంబంధిత రుగ్మతల వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దోహదం చేస్తాయి. గుమ్మడి గింజలలోని యాంటీఆక్సిడెంట్లు కణాలను రక్షించి, వాపును తగ్గించి, చర్మ ఆరోగ్యానికి తోడ్పడతాయి. గుమ్మడి గింజలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆక్సీకరణ నష్టాన్ని తగ్గించి, శరీర రక్షణ వ్యవస్థను మెరుగుపరిచి, దీర్ఘాయువును ప్రోత్సహిస్తుంది. మానసిక ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది. రోజూ ఒక చిన్న గుప్పెడు (సుమారు 30 గ్రా.) గుమ్మడి గింజలను తీసుకోవచ్చు.

## దుష్ప్రభావాలు

గుమ్మడికాయ గింజలు తిన్న తర్వాత కొంతమందికి దురద, వాపు లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగవచ్చు. అధిక ఫైబర్ కంటెంట్ కారణంగా దీనిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్ లేదా కడుపునొప్పి రావచ్చు. అధిక కేలరీలు, కొవ్వు పదార్థాలను మితిమీరి తింటే, అనవసరంగా బరువు పెరిగే అవకాశం ఉంది.

గుమ్మడి గింజలు రక్తాన్ని పలుచబరిచే ప్రభావాలను పెంచి, కొంతమందిలో రక్తస్రావ ప్రమాదాన్ని పెంచవచ్చు. సరికాని మూలాల సేకరణ కాడ్మియం లేదా సీసం వంటి కాలుష్య కారకాలకు గురికావడానికి దారితీయవచ్చు. అవసరమైనంత నీరు తీసుకోకుండా గుమ్మడి విత్తనాలను అధికంగా తీసుకోవడం వల్ల పేగులలో అడ్డంకి ఏర్పడవచ్చు. గింజలు లేదా విత్తనాలకు అలర్జీ ఉన్న వ్యక్తులు గుమ్మడికాయ విత్తనాలకు కూడా ప్రతిస్పందించ వచ్చు. గుమ్మడి గింజలు రక్తంలో చక్కెరను ప్రభావితం చేయగలవు. మధుమేహ వ్యాధిగ్రస్తులు వీటిని తీసుకునే పరిమాణాన్ని జాగ్రత్తగా పర్యవేక్షించుకోవాలి.

**– ఆనంద'మైత్రేయ'మ్**

కథ

# చిట్టి సందేహం

ప్రతీ విషయం తెలుసుకోవాలని చిట్టికి కుతూహలం ఎక్కువ. ఒకరోజు చిట్టికి ఒక ధర్మ సందేహం వచ్చింది. తాతయ్య దగ్గరకు వెళ్ళింది. "తాతయ్యా! గాలి వీస్తే చల్లగా ఉంటుంది. మరి మనకు గాలి ఎందుకు కనిపించడం లేదు?" అని అడిగింది.

"గాలి మనకు కనిపించదు కానీ అందరికీ ముఖ్యమైనది" అన్నాడు తాతయ్య. "గాలి ఎలా ఉంటుంది?" ఆరా తీస్తూ అడిగింది చిట్టి.

"గాలికి రంగు, రుచి, వాసన ఉండవు కానీ అపారమైన శక్తులు ఉన్నాయి" నవ్వుతూ అన్నాడు తాతయ్య.

"ఆ విషయం నీకెలా తెలుసు" ఆశ్చర్యంగా అంది చిట్టి. "నాతో రా!" అని వాకిట్లోకి వెళ్ళి చుట్టూ చూసి ఒక ఎండి పోయిన ఆకును తెచ్చి అక్కడే గట్టు మీద పెట్టాడు. మెల్లగా గాలి వీచగానే ఆ ఆకు ఉన్న చోటు నుండి కదిలింది. "చిట్టీ, ఆకు ఎలా కదులుతుంది?" అని ప్రశ్నించాడు తాతయ్య.

"గాలి వీస్తే కదులుతుంది" అంది చిట్టి. "గాలికి కంటికి కనిపించే రూపం లేదు, కానీ వస్తువులను కదిలించే శక్తిని కలిగి ఉంటుందని ఒప్పుకుంటావా?" అన్నాడు తాతయ్య.



ఒప్పుకుంటాను.. అంది చిట్టి.

తరువాత తాతయ్య లోపలకు వెళ్ళి రెండు ఖాళీ బూరలను తెచ్చాడు "చిట్టీ, ఈ బూరలు పట్టుకుంటే ఎలా ఉందో చెప్పు" అన్నాడు తాతయ్య.

"మెత్తగా ఉన్నాయి తాతయ్యా" వాటిని పట్టుకుని చూసి చెప్పింది చిట్టి. ఒక బూరలో నీరు పోసి ముడి వేసాడు. మరో బూరను నోటితో ఊది ముడి వేసాడు. "ఈ నీటి బూరను నొక్కి చూడు" అన్నాడు తాతయ్య.

"గట్టిగా ఉంది తాతయ్యా!" అంది చిట్టి.

"ఇప్పుడు గాలిని నింపిన బూరను నొక్కి చూడు" అన్నాడు తాతయ్య.

"గట్టిగానే ఉంది తాతయ్యా" అంది చిట్టి.

"అంటే గాలికి వస్తువుల లాగానే స్థలాన్ని ఆక్రమించే శక్తి ఉంది" వివరించాడు తాతయ్య. తరువాత పెరట్లో ఉన్న మొక్కల దగ్గరకు తీసుకువెళ్లాడు. "మనం శ్వాసించేటపుడు వదిలే కార్బన్ డై ఆక్సైడ్ వాయువును ఈ మొక్కలు పీల్చుకుని 'ఆక్సిజన్' అనే ప్రాణవాయువును బయటకు వదులుతాయి. గాలి లేకపోతే సృష్టిలోని ప్రాణులేవీ బతకలేవు. అంతటి గొప్ప శక్తులు గాలికి ఉన్నాయి" అన్నాడు తాతయ్య.

"ఇంకా?" కళ్ళు పెద్దవి చేసి అడిగింది చిట్టి.

"గాలికి గొప్ప, బీద తారతమ్యం లేదు. అందరికీ సమాన స్థాయిలో అందుతుంది. మంచి గాలి రావాలంటే మనం ఆకుపచ్చటి మొక్కలు ఎక్కువగా పెంచాలి. అప్పుడు స్వచ్ఛమైన గాలి లభిస్తుంది. ఇంటి చుట్టూ మురుగు వాతావరణం లేకుండా చూసుకోవాలి. అపరిశుభ్రమైన పరిసరాల మీద నుండి వచ్చే గాలి కలుషితమవడం వల్ల అనారోగ్యాలు వస్తాయి" చెప్పాడు తాతయ్య.

"అందుకేనా? మురుగు నీటి కాలువ దగ్గర దుర్వాసన వస్తుంది?" అడిగింది చిట్టి. "అవును, వాతావరణం కాలుష్యం కాకుండా చూసుకోవలసిన బాధ్యత అందరికీ ఉంది. గాలి గొప్పతనం ఇప్పుడర్థమైందా?" అన్నాడు తాతయ్య. తాతయ్య చెప్పిన పాఠం చిట్టికి అర్థమైంది. గాలి రంగు తెలియకపోయినా, కనిపించకపోయినా, అది ప్రకృతిలో అతి ముఖ్యమైన భాగమని తెలుసుకుంది చిట్టి.

– సుమ కైకాల



వార్త ఆదివారం

## బాలగేయం

### మా కోసమే

ఆ కోయిల కూసేది
మాకోసమే
తొలిపొద్దు పొడిచేది
మాకోసమే
మలిపొద్దు కుంగేది
మాకోసమే
కరిమబ్బులు కమ్మేది
మాకోసమే
పురి విప్పి ఆడే నెమలి
మాకోసమే
బంగినపల్లి మామిడి
మాకోసమే
చిరుజల్లులు కురిసేది
మాకోసమే
చిగురాకులు తొడిగేది
మాకోసమే
నగుమోము విరిసేది
మాకోసమే
కొండపల్లి బొమ్మలు మాకోసమే
కుందనపు కమ్మలు మాకోసమే
ఆ తేనెల ఊటలు మాకోసమే
ఈ తెలుగు మాటలు
మాకోసమే

– గుండాల నరేంద్రబాబు

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**కె.అనూజ్, కనిగిరి**

ప్రశ్న: రాత్రివేళల్లోనే రేడియో ప్రసారాలు బాగా స్పష్టంగా వినిపిస్తాయి కారణం?

**జవాబు:** రేడియో కేంద్రం నుంచి ఆయా కార్యక్రమాలను రేడియో సంకేతాల ద్వారా విడుదల చేస్తారు. ఈ సంకేతాలు ఆకాశంవైపు పయనించినప్పుడు అక్కడి అయనోస్ఫియర్(ఒక ఆవరణం)ను ఎదుర్కోవలసి ఉంటుంది. తద్వారా రేడియో సంకేతాలు వెనుదిరిగి భూమి మీదకు ప్రసరిస్తాయి. ఈ క్రియను పరావర్తనం అంటారు.

ఈ ప్రక్రియ పగటివేళకు, రాత్రివేళకు వ్యత్యాసం కలిగి వుంటుంది. రాత్రివేళల్లోనే పరావర్తనం నిఖార్సుగా ఉంటుంది. వెనుదిరిగిన రేడియో సంకేతాలు స్పష్టంగా, నాణ్యతతో భూమి మీదకు చేరతాయి. ఈ పరిణామం అయనోస్ఫియర్ వలన ఏర్పడుతుంది. పగటివేళ ఎండ పెరిగినకొద్ది అయనోస్ఫియర్ రేడియో సంకేతాలను లోబరుకోవడంతో భూమి మీదకు చేరేవి బలహీనంగా ఉంటాయి. దీని అర్థం ఎలక్ట్రాన్ల గాఢత పెరిగి మరొక పొర ఏర్పడడమే. సాయంత్రం వేళకు ఎలక్ట్రాన్ల గాఢత క్షీణించడం, అయనోస్ఫియర్ రేడియో సంకేతాలను లోబరుకోవడం తగ్గిపోవడం, పరావర్తనం చెందిన రేడియో సంకేతాల నాణ్యత పెరగడం వరుసగా జరిగిపోతాయి. ఈ కారణంతో రాత్రివేళలో రేడియో ప్రసారాలు సుస్పష్టంగా వినిపిస్తాయి.

**సి.హైమవతి, గుంటూరు**

**ప్రశ్న: లోహం వ్యాకోచిస్తుంది అనడానికి ఉదాహరణ?**

**జవాబు:** వేడికి లోహం వ్యాకోచిస్తుంది కనకనే ఈఫిల్ టవర్ ఎప్పుడూ సూర్యుడికి వ్యతిరేక దిశ వైపు కొంచెం ఒరుగుతుంది.







కథ

# ప్రక్షాళన

పంతంగి శ్రీనివాస రావు

'పోస్ట్‌మార్టం' పూర్తయ్యాక డెడ్ బాడీస్‌ను వారి కుటుంబ సభ్యులకు ఒప్పగిస్తూ, తల వంచుకుని ఉన్న వారిని చూసిన ఎస్.పి. వైజయంతికి ఎందుకో బాధ కలిగింది.

"ఏమిటి ఈ జీవితాలు? బతకటానికి ఎన్నో దారులు ఉండగా, ఇటువంటి మార్గాన్నే ఎంచుకోవాలా?" అనిపించింది.

"కానిస్టేబుల్‌కు ఎలా ఉంది?" అడిగింది పక్కనే ఉన్న ఏ ఎస్పిని.

"ఔటాఫ్ డేంజర్ మేడం.." చెప్పాడు ఏఎస్పి.

జరిగిన సంఘటన, సబార్డినేట్స్ వివరించిన దాని ప్రకారం గుర్తుకు తెచ్చుకుంది కొద్దిసేపు వైజయంతి.

'దోపిడి గ్యాంగ్' నగర శివార్లలో ఉన్న ఒక ఇంటిలో దోపిడి చేస్తూ, అడ్డం వచ్చిన వృద్ధ దంపతులను అతి దారుణంగా హతమార్చింది.

సీనియర్ సిటిజన్ అయిన ఆ వ్యక్తి, ఆ గ్యాంగ్ తలుపులను బద్దలు కొట్టే సమయంలో, తెలివిగా తన మొబైల్ నుంచి పోలీసులకు సమాచారం అందించాడు. అయితే పోలీసులు వచ్చేలోగా జరగవలసిన ఘోరం జరిగి పోయింది. ఆ గ్యాంగ్‌లోని ఒకతను చేతిలో ఉన్న గొడ్డలితో ఒక కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. ఆత్మ రక్షణార్థం పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆ గ్యాంగ్‌లోని ఇద్దరు వ్యక్తులు చనిపోగా, మిగిలినవారు పారిపోయారు. ఇదీ జరిగిన సంఘటన.

మృతదేహాల వద్ద ఇద్దరు పసి పిల్లలు బిక్కు బిక్కు మంటూ ఉన్నారు తలలు వంచుకుని ఉన్నారు. సమాచారం ప్రకారం ఆ ఇద్దరిలో ఒక బాబు చనిపోయిన గ్యాంగ్‌లోని ఒక వ్యక్తి కుమారుడు. మరొక అమ్మాయి చనిపోయిన గ్యాంగ్‌లోని మరొక వ్యక్తి చెల్లెలట.

తాను ఎస్పిగా బాధ్యతలు చేపట్టాక జరిగిన తొలి 'ఎన్ కౌంటర్' ఇది.

.................

స్టేషన్‌లో తన సీటులో కూర్చుని ఏఎస్పిని పిలిచింది వైజయంతి.

అతను వచ్చి సెల్యూట్ చేశాక, తన ఎదుటి సీటు చూపెట్టింది కూర్చోమని, సైగ ద్వారా.

"చెప్పండి.. నేను ఈ జిల్లాకు ఎస్పిగా రాకముందు, ఇటువంటి దోపిడీలు, ఎన్‌కౌంటర్‌లు ఏవైనా జరిగాయా?" సూటిగా అడిగిందామె.

"దోపిడీలు జరిగాయి కానీ, ఎన్ కౌంటర్ మాత్రం ఇదే మేడం.." చెప్పాడు ఏఎస్పి.

"ఈ దోపిడీ గ్యాంగ్ గురించి వివరాలు..!"

"ఎంక్వయిరీ చేశాం మేడం.. ఇప్పుడు ఎన్‌కౌంటర్ అయిన వారిది సమీపంలోని మెదక్ జిల్లాలో గల నాగలాపురం గ్రామం. ఆ పల్లెల్లో చాలా మంది వృత్తే ఇది. వారిలో ఆడవారు పగలు రెక్కీ నిర్వహిస్తారు. తాళాలు వేసిన ఇళ్ళు, వృద్ధులు ఉన్న ఇళ్లే వీళ్ళ టార్గెట్.." చెప్పాడు.

అతనే చెప్పాడు మరల.

"వీరిలోని అవిద్య, అజ్ఞానం వల్లనే వీరు ఈ వృత్తిని ఎంచుకున్నారు. అదీగాక, ఈజీ మనీ సంపాదనకు అలవాటు పడ్డారు. ఒక్కసారి దోపిడీకి పాల్పడితే, కొన్ని వారాలు ఎంజాయ్ చేస్తారు సిటీలోనే.."

"మరి.. ఆ ఊరి మీద దాడి.."

అడుగుతుండగా అడ్డొచ్చి.. "అది కూడా జరిగింది మేడం. అయితే, అసలు నేరస్థులు ఆ ఊరిలో ఉండరు. వారికి సంబంధించిన పెద్దవాళ్ళు మాత్రమే ఉంటారు. వారిని బెదిరించినా, నిజం చెప్పరు. పోలీస్ స్టేషన్‌లో ఉంచినా, ఏ మాత్రం తొణకరు" చెప్పాడు ఏఎస్పి.

"నేనొకసారి ఆ ఊరికి వెళ్లాలి. అయితే, ఎస్పిగా కాదు, ఒక సామాన్య స్త్రీగా.." చెప్పింది వైజయంతి.

"మేడం..!" ఆశ్చర్యంగా నోరు వెళ్ళబెట్టి "ప్రమాదం మేడం" చెప్పాడు ఏఎస్పి.

"ఫర్వాలేదు.. అయితే, ఒక కండిషన్. నన్ను ఎవరూ ఫాలో కావద్దు" ఆజ్ఞ జారీ చేసింది వైజయంతి.

.................

'పల్లె వెలుగు' బస్సు దిగింది వైజయంతి. పింక్ కలర్ శారీ.. అదే కలర్ బ్లౌజ్.. అచ్చు గృహిణిలా భుజాలకు వేళ్ళాడుతూ ఒక హ్యాండ్ బాగ్.

బస్సులోనే కండక్టర్‌ను అడిగింది. "నాగలాపురం ఎలా వెళ్ళాలి?" అని.

కండక్టర్ ఆశ్చర్యపోయాడు. సామాన్యంగా ఆ ఊరికి ఇలా దారి ఎవరూ అడగరు. అయినా చెప్పాడు.. ఫలానా స్టేజ్‌లో దిగి, ఎడమవైపు రెండు కిలోమీటర్ల దూరం నడక

వలసి ఉంటుందని... స్టేజ్ వద్ద దిగి నడక సాగించింది వైజయంతి. ఆ దారంతా నిర్మానుష్యంగా ఉంది. మొండి ధైర్యంతో నడవసాగింది ఆమె. తాను 'కరాటే'లో బ్లాక్ బెల్ట్. అందుకే గుండె నిండా ధైర్యం. నాగలాపురం సమీపిస్తుండగా, ఊరు వచ్చిందటానికి నిదర్శనంగా అక్కడక్కడా ఇళ్ళు కనిపించసాగాయి. కనీసం వంద ఇళ్ళు కూడా లేని పల్లె కావచ్చు అని ఆమె అంచనా వేసింది.

వైజయంతికి ఎదురు పడిన ఒక వ్యక్తి, ఆమెను అనుమానంగా చూడసాగాడు. అతనికి అరవై సంవత్సరాల పైనే ఉండొచ్చు. వైజయంతి చిరునవ్వు చూసి, అతనే దగ్గరకు వచ్చి అడిగాడు "ఎవరమ్మా నువ్వు? నీకు ఈ ఊర్లో ఏం పని..?" అని.

"నేను పేపర్లో పని చేస్తాను పెద్దాయనా. ఈ ఊరు గురించి రాద్దామని.." ఏమాత్రం తొట్రుపాటు లేకుండా చెప్పింది ఆమె.

"పెద్దింటి బిడ్డలాగున్నావు. వచ్చిన దారినే వెనక్కు తిరిగి వెళ్ళమ్మా. ఈ ఊరిలో ఇంతవరకూ ఎవరూ అడుగు పెట్టలేదు" చెప్పాడు అతను.

"మొన్ననే ఈ ఊరి వ్యక్తులను పోలీసులు కాల్చి చంపారట. వారి గురించి" అడగబోతుండగా–

"అవునమ్మా.. పోలీసుల భయానికే ఈ ఊర్లో ఎవరూ ఉండరు. మా వంటి పెద్దవాళ్ళు తప్ప" చెప్పాడు.

"మరి.. మీరైనా చెప్పొచ్చుగా మీ పిల్లలకు. మీరు చేస్తున్న పనులు తప్పురా అని" అప్పుడు నవ్వాడు ఆ వ్యక్తి బిగ్గరగా. "మా బతుకే అది. దాని గురించి ఎక్కువగా మాట్లాడకమ్మా" అతని కంఠంలో కొద్దిగా సీరియస్‌నెస్ కనిపించింది.

అప్పుడు ఆ ప్రాంతంలో ఉన్న దాదాపు పాతిక ఇళ్ల గడపల తలుపులు తెరుచుకున్నాయి.

తేరిపార చూసింది వైజయంతి. అందరూ పెద్ద వయస్సు వారే! ఒక్కొక్కరి చేతుల్లో కత్తిపీటలు, కొడవళ్ళు, గుప్పెళ్ల నిండా కారం పొడి.

"చూసావా తల్లీ! మమ్మల్ని మేము కాపాడుకోవడం మాకు తెలుసు. ఊర్లో ఏ మాత్రం అలికిడి అయినా అందరి ప్రతిస్పందనా ఇలాగే ఉంటుంది" చెప్పాడు ఆ పెద్దాయన.

ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కూడా దాడి తప్పదని అర్థమయింది వైజయంతికి. చేతులు పైకెత్తి అందరికీ నమస్కారం చేసింది. నేను కూడా మీలో ఒక వ్యక్తిని అన్న భావన ద్యోతకం అయింది ఆ అభివాదంలో.

"చూడు పెద్దాయనా.. వీలయినంత మందితో సమావేశం ఏర్పాటు చేస్తావా కొద్ది నిమిషాల్లో. నన్ను మీ మేలు కోరే వ్యక్తిగా భావించండి. నేనేమీ మీ శత్రువును కాను. ఏదైనా తేడా వస్తే ఆపై మీ ఇష్టం' చెప్పింది వైజయంతి.

ఉదయాన్నే ఆ చనిపోయిన ఇద్దరికీ దహన క్రియలు జరిగాయి. చనిపోయిన వారిలో ఒకతనికి భార్య, ఆరేళ్ల కొడుకు ఉండగా, మరొక వ్యక్తికి చెల్లెలు ఉంది. అతనికి ఇంకా పెళ్ళి కాలేదు.. తల్లిదండ్రులూ లేరు. అతనికి వైజయంతి మీద కొద్ది కొద్దిగా నమ్మకం కలుగుతోంది.

**"చూసావా తల్లీ! మమ్మల్ని మేము కాపాడుకోవడం మాకు తెలుసు. ఊర్లో ఏ మాత్రం అలికిడి అయినా అందరి ప్రతిస్పందనా ఇలాగే ఉంటుంది" చెప్పాడు ఆ పెద్దాయన. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కూడా దాడి తప్పదని అర్థమయింది వైజయంతికి.**

ఎంతటి కర్కశ మనస్కులు అయినా కూడా, ఆమె మాట తీరుకు మంత్రముగ్ధులు కావలసిందే! తను నేర్చుకున్న 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' గొప్పతనం అది.

అప్పటికీ ఏఎస్‌పి చెప్పాడు. ఆ ఊరికి ఒంటరిగా వెళ్ళడం రిస్క్ అని. అయినా కూడా తెగించి వచ్చింది. దాని వెనుక ఉన్న కారణాలు వేరు. చనిపోయిన వ్యక్తుల ఇళ్లు ప్రక్క ప్రక్కనే ఉన్నాయి. పేపర్లో పని చేస్తుందని చెప్పాడతను. ఆ పేపర్ల గోలేంటి? అనేది ఎవరికీ అర్థం కాలేదు. అయినా, హుందాగా ఉన్న వైజయంతిని చూస్తోంటే, అదీ కాకుండా తమ ఊరిలో తొలిసారిగా ఒంటరిగా అడుగు పెట్టిన ఒక స్త్రీని చూస్తుంటే అందరికీ అబ్బురంగానే ఉంది.

ఆ చనిపోయిన వారింట అలుముకున్న విషాదాన్ని గమనించింది. ఆ ఊరిలో సగం జనం అక్కడే ఉన్నారు.

ఊపిరి బిగబట్టి, కొద్దిగా శ్వాస తీసుకుని చెప్పిందామె.

"చూడండీ! ఈ ఇంట జరిగిన విషాదం మరెవరి ఇంటా జరగకూడదు. ఎవరి ప్రాణమయినా విలువ గలదే! మీ ఇంట్లోని మగ వారికి చెప్పండి. వారు దోపిడీలు చేస్తుంటారని, ఈ ఊరికి చాలా చెడ్డ పేరు ఉంది. మునుముందు ఈ ఊరిలో పెరుగుతున్న అబ్బాయిలకు, అమ్మాయిలకు పెళ్ళిళ్ళు కావడం చాలా కష్టం. అందుకే, కష్టపడి బ్రతకమని చెప్పండి. పని చేయాలే కానీ, ఎన్నో పనులు ఉన్నాయి. శ్రమలోనే ఆనందం ఉంటుంది. నెత్తుటి కూడు వద్దని చెప్పండి. ఈ ఇళ్లలోనే కాదు విషాదం, వీరి వల్ల ఇద్దరు పెద్ద మనుషులు కూడా చనిపోయారు. ప్రాణాలు తీయడం కాదు. ప్రాణం పోయడం గొప్ప" చెపుతూ ఆగిందామె..

అందరూ చాలా శ్రద్ధగా ఆమె మాటలను ఆలకిస్తున్నారు. వైజయంతికి ఎంతో ఆనందం కలిగింది. మరెంతో ధైర్యం వచ్చింది.

"నా ద్వారా ప్రభుత్వానికి విన్నవిస్తాను. జరిగింది మర్చిపోండి. హతులైన ఈ కుటుంబాల నిర్భాగ్యులకు నా ద్వారా ఆశ్రయం కల్పిస్తాను. ఆడవారిని పట్టణంలోని కుట్టు శిక్షణా కేంద్రంలో చేర్పిస్తాను. ఈ బాబును.." దగ్గరకు తీసుకుని నుదుటి మీద ముద్దు పెట్టి– "మంచిగా చదువుకునేలా, ఉన్నత స్థాయికి వచ్చేలా కృషి చేస్తానని హామీనిస్తున్నాను" అప్పటి వరకూ నిలబడే మాట్లాడుతుందామె.

ఇంతలో ఒకరు లోపలకు వెళ్ళి ఒక కుర్చీ తీసుకువచ్చి వేశారు. అప్పుడు కూర్చుందామె..

"మీ ఊరిని బాగుపరుస్తాను. అందరికీ పని కల్పించేలా నేనొక ప్రణాళికను రూపొందిస్తాను. నన్ను నమ్మండి" కఠినాత్ములైన కుటుంబ సభ్యుల మధ్య ఆమె ఒక ధీరోదాత్తురాలిలా మాట్లాడుతుంటే అందరూ మంత్ర ముగ్ధులయ్యారు. ఆమె తిరిగి వెళ్లేటప్పుడు అందరూ ఆమె వెంట వచ్చి బస్సెక్కించారు.

......................

వైజయంతి స్టేషన్‌లో కూర్చోగానే డిజిపి నుంచి ఫోన్.

"గుడ్ మార్నింగ్ సార్" వినయంగా చెప్పింది. "ఎస్పి గారూ.. కొంత ఫోర్స్ తీసుకుని నాగలాపురం మీద రైడ్ చేయండి" ఆజ్ఞ జారీ చేసారు.

"మన చిన్ననాటి స్నేహానికి ఇంకా విలువ ఇస్తున్నందుకు థ్యాంక్స్" ఆగి- "నువ్వు నాగలాపురం అనే గ్రామాన్ని దత్తత తీసుకోవాలి" చెప్పిందామె.

"సార్! ఒక రిక్వెస్ట్" అభ్యర్థించిందామె.

"చెప్పండి..!" తాను నాగలాపురం గ్రామాన్ని సివిల్ డ్రెస్‌లో విజిట్ చేసిందీ, ఆ తర్వాత జరిగిన విషయం మొత్తం క్లుప్తంగా వివరించింది. తనకు ఒక వారం టైం ఇవ్వమని అడిగిందామె.

"ఈజిట్..!" అని ఆగి– "క్యారీ ఆన్.. ఇది సున్నిత అంశం. కొద్దిగా అలర్ట్‌గా ఉండండి. అన్ని విషయాలూ ఎప్పటికప్పుడు రిపోర్ట్ చేయండి" చెప్పాడాయన.

"హమ్మయ్య..!" కొద్దిగా స్థిమితపడ్డాక.. ఒక నంబర్‌కు ఫోన్ కలిపింది వైజయంతి.

"సర్‌ప్రైజ్.. మేడం గారికి ఇప్పుడు గుర్తుకు వచ్చానా?" అవతల నుంచి రిప్లై రావడంతో–

"అజయ్, ఎలా ఉంది బిజినెస్. రియల్ ఎస్టేట్ విపరీత బూమ్‌లో ఉన్నట్టుంది" "ఏమిటి విషయం.. ఏదైనా వెంచర్‌లో ప్లాట్ కావాలా?" అడిగాడతను. "దానికి కొంచెం టైమ్ పడుతుంది. గతంలో ఒక హామీ ఇచ్చావ్.. గుర్తుందా?" "నా బిజినెస్‌లో పార్టనర్‌షిప్ కావాలా?" అడిగాడతను. "ఈ ఉద్యోగంలోనే నిమిషం తీరిక ఉండటం లేదు. అంత సీన్ లేదు కానీ. నువ్వు వదాన్యుడవు అనే పేరు నిలబెట్టుకునే అవకాశం వచ్చింది" "వావ్.. ష్యూర్! నీ ఆజ్ఞ అనుసరణీయం"

"మన చిన్ననాటి స్నేహానికి ఇంకా విలువ ఇస్తున్నందుకు థ్యాంక్స్" ఆగి– "నువ్వు నాగలాపురం అనే గ్రామాన్ని దత్తత తీసుకోవాలి" చెప్పిందామె.

"ఒకే! డన్" "ఆగాగు.. అది దోపిడీ దొంగల గ్యాంగ్‌కు పేరు పడిన గ్రామం" "లా అండ్ ఆర్డర్ నాతో ఉంటే.. కరడు కట్టిన హంతకుల ఆవాసమైన గ్రామాన్నయినా డెవలప్ చేస్తాను" "సీరియస్‌గా విను అజయ్, అక్కడ సేద్యానికి పనికి వచ్చే భూమి చాలా ఉంది. అక్కడి ప్రజల్లో మార్పు రావాలి. వారికి సరియైన జ్ఞానం రావాలి.. వారి పిల్లలకు తగిన విద్యా బోధన జరగాలి"

"ఇదంతా ఎందుకు? ఆ గ్రామాన్ని ఎప్పుడు విజిట్ చేద్దాం?" ఆతృతగా అడిగాడతను.

......................

నాలుగు సంవత్సరాల తర్వాత.. ఒక మంచి వార్త అందుకున్న వైజయంతి ఉబ్బి తబ్బిబ్బు అయింది. 'నాగలాపురం' గ్రామం ఆదర్శ గ్రామంగా గుర్తించబడింది. ఇప్పుడు ఆ ఊరికి రోడ్ సౌకర్యం ఉంది. ఆ గ్రామ ప్రజలు జన జీవన స్రవంతిలో కలిశారు. వ్యవసాయ రంగంలో అద్భుత ప్రగతిని సాధించారు. "ఈ జన్మకు ఇంతకు మించిన ఆనందం ఇంకేమీ వద్దు భగవాన్!" ఎంతో సంతృప్తి లభించింది ఎస్.పి. వైజయింతికి.

............................

సుదీర్ఘ కాలం పోలీస్ శాఖలో విశిష్ట సేవలు అందించిన వైజయంతి పదవీ విరమణ అనంతరం నగర శివార్లలోని ఒక 'విల్లా'లో భర్తతో ప్రశాంత జీవనం గడుపుతోంది. పిల్లలు బాగా సెటిల్ అయ్యారు, అమెరికాలో. ఎప్పుడైనా, మనవళ్ళు, మనవరాళ్ళకు తమ అవసరం కలిగి పిల్లలు పిలిస్తే పతి సమేతంగా వెళ్ళి ఓ నాలుగు నెలలు గడిపి వస్తుందామె.

"అమ్మా..!" సుదీర్ఘ ఆలోచనల్లో నిమగ్నమై ఉన్న వైజయంతి తల ఎత్తి చూసింది. చేతులు జోడించి ఎదురుగా నిలబడి ఉన్నాడు ముప్పయి సంవత్సరాల ఓ యువకుడు. "ఎవరు బాబూ నువ్వు?" కళ్ళద్దాలు కొద్దిగా కిందకు దించి పలకరించింది వైజయంతి.

"అమ్మా.. నా పేరు డాక్టర్ వినయ్ కుమార్. నా భార్య కూడా డాక్టరే! మేము స్థాపించిన హాస్పిటల్‌కు మీ చల్లని చేతులతో ప్రారంభోత్సవం చేయాలి" చెప్పాడు వినయంగా. "నేను అంత ప్రముఖ వ్యక్తిని కాను బాబు. ఇందుకు ఏ మినిస్టరో, ఎంపినో అయితే బెటర్. నన్ను ఆహ్వానిస్తే ఒక సాధారణ పౌరురాలిగా వచ్చేస్తాను, హాస్పిటల్ ప్రారంభం రోజు" గంభీరంగా చెప్పింది ఆమె.

"అమ్మా, మీ చేతులతోటే ప్రారంభం చేస్తే నా ఈ జీవితానికి సార్థకత. కాదనకండి" అతని కళ్ళల్లో నీటి చెమ్మ చూసి చలించిపోయింది వైజయంతి "ఇంతకూ నువ్వు" సందేహంగా చూస్తోన్న ఆమెతో–

"అమ్మా, మాది నాగలాపురం గ్రామం" అతను చెప్తోంటే ఏదో హృదయ స్పందన ఆమెలో.

"మా నాన్న ఎన్‌కౌంటర్‌లో మరణించాక, మీరు మా గ్రామానికి వచ్చి ఆదుకున్న ఆ బాలుడిని నేనేనమ్మా. నన్ను ముందుగా హాస్టల్‌లో చేర్పించి, నాకు అన్ని సౌకర్యాలు గుప్తంగా కల్పించిన అమృతమూర్తి మీరు. మా హాస్పిటల్ ప్రారంభోత్సవం చేయటానికి మీకు మాత్రమే అర్హత ఉంది" అంటూ ఆమె పాదాల మీదకు వంగి, కళ్ళకు అద్దుకున్నాడు. ఆమె పాదాల మీద కన్నీటి చుక్కల తడి.. "ఓ! నువ్వా? కంగ్రాట్స్ బాబు. మొత్తానికి డాక్టర్‌వి అయ్యావన్నమాట. నీ వృత్తిలో కొంతమంది పేదలకు అయినా ఉచిత వైద్యం అందించి, వారికి ప్రాణదానం చేస్తే, అదే నువ్వు నాకు అందించే కృతజ్ఞత బాబూ" ఆమె ప్రతి పలుకులో ఎంతో తాదాత్మ్యం..

"అమ్మా.. నేను స్వయంగా వచ్చి మిమ్మల్ని పికప్ చేసుకుంటాను" అంటూ తేదీ, స్థలం చెప్పాడతను.

"ఇంతకూ హాస్పిటల్ పేరు...!"

అడుగుతోన్న ఆమెకు 'వైజయంతి హాస్పిటల్' అని ఎంతో గర్వంగా చెప్పాడు.

# నిజం, ఊహల మధ్య రేఖ మసకబారుతోందా?

"ఒకప్పుడు ఫొటోను చూసినా, వీడియోను చూసినా వాస్తవానికి ప్రతిరూపంగా భావించేవారు. అంటే మనం చూసే ప్రతి చిత్రం, ప్రతి వీడియో వెనుక ఒక కెమెరా, ఒక సంఘటన, ఒక నిఖార్సైన వాస్తవం ఉండేది. కానీ నేడు ఉత్పాదక కృత్రిమ మేధస్సు (జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎఐ) విస్తృతితో ఆ పాత నమ్మకం పునాదులతో సహా కదిలిపోతోంది. ఇప్పుడు మనిషి కంటికి అసాధ్యంగా అనిపించే దృశ్యమైనా, కెమెరా ఎన్నడూ చూడని ఘటన అయినా, కేవలం కొన్ని పదాల 'టెక్స్ట్ ప్రాంప్ట్'తో వాస్తవంలా కనిపించే అద్భుతమైన చిత్రాలు, వీడియోలు సృష్టించబడుతున్నాయి. ఈ పరిణామం నేపథ్యంలో ప్రధాన ప్రశ్న "ఎఐ చిత్రాలు ఎంత అందంగా ఉన్నాయి?" అనేది కాదు; "మనకు కనిపిస్తున్నదంతా నిజమేనా?" అన్నది. అసలు ఊహకు, నిజానికి మధ్య ఉన్న సరిహద్దు రేఖ మసకబారుతోందా? ఊహాశక్తి వాస్తవాన్ని కప్పివేస్తోందా? అనే ప్రశ్నలు ఇప్పుడు మనల్ని లోతుగా ఆలోచింపజేస్తున్నాయి.

## ఎఐ మనిషి ఊహాశక్తికి రెక్కలుగా మారుతున్నది..

నేటి దృశ్య కృత్రిమ మేధస్సు (విజువల్ ఎఐ) సామర్థ్యాలు మానవ ఊహాశక్తిని అపారంగా విస్తరించాయి. "చంద్రుడిపై పాఠశాలలు", "సముద్రం అడుగున నిర్మించిన నగరం," "వర్షంలో నడుస్తున్న పురాణ యోధుడు," "సూర్యాస్తమయం సమయంలో చంద్రుడిపై నడుస్తున్న ఒక భారతీయ వ్యోమగామి" ఇలాంటి వాక్యాలు ఒకప్పుడు కేవలం ఊహల్లో మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడు కొన్ని పదాలు టైప్ చేస్తే చాలు, కొన్ని క్షణాల్లోనే అవి ఫొటోరియలిస్టిక్ రూపంలో మన కళ్ళ ముందు సాక్షాత్కరిస్తున్నాయి. ఓపెన్ ఎఐ సోరా (Open AI Sora) వంటి అత్యాధునిక వ్యవస్థలు కేవలం స్టిల్ ఇమేజ్‌లను మాత్రమే కాకుండా, బహుళ పాత్రలు, నిర్దిష్ట చలనాలు, సంక్లిష్ట భావోద్వేగాలు, దృశ్య శైలిలో స్థిరత్వం కలిగిన 'ఫొటో రియలిస్టిక్' వీడియోలను కూడా సృష్టించగలవని నిరూపించాయి.

ఎఐ సృజనాత్మక ప్రపంచానికి విప్లవాత్మక అవకాశాలను తెరిచింది. సినిమా, విద్య, ప్రకటనలు, గేమింగ్, డిజైన్, వైద్యం వంటి ఎన్నో రంగాల్లో ఎఐ చిత్రాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. కళారంగంలో ఒక చిన్న బడ్జెట్ సినిమా నిర్మాణంలో దర్శకుడు పెద్ద స్టూడియో స్థాయి కాన్సెప్ట్ విజువల్స్‌ను ఎఐ అప్లికేషన్స్‌తో వేగంగా, తక్కువ బడ్జెట్‌లో రూపుదిద్దుకోవచ్చు. విద్యారంగంలో ఉపాధ్యాయులు సంక్లిష్టమైన విజ్ఞాన భావనలను దృశ్యరూపంలో చూపిస్తూ, విద్యార్థులకు కళ్ళకు కట్టినట్లుగా సులభతరంగా విద్యాబోధన చేయవచ్చు. చరిత్రకారులు గతాన్ని దృశ్యరూపంలో పునర్నిర్మించవచ్చు; నగర నిర్మాణ శిల్పి ఇంకా కట్టని నగరాన్ని ముందే ఎఐ ఊహాశక్తితో వీక్షించవచ్చు. ఒక రచయిత తన నవలలోని ప్రపంచాన్ని కళ్లముందు నిలబెట్టగలడు. ఇలా ఎఐ మనిషి ఊహను వాస్తవంలా కనిపించే దృశ్యంగా మారుస్తూ అద్భుతాలను సృష్టిస్తూ... మనిషి ఊహకు రెక్కలుగా మారుతుంది.




## ఎఐ ఊహా చిత్రాలు మనిషి ఇంద్రియశక్తికి సవాల్

కృత్రిమ మేధస్సు మనిషి ఊహకు వాస్తవ రూపాన్ని ఇస్తూ అద్భుతాలను సృష్టిస్తోంది. అయితే ఇక్కడ ఆలోచించాల్సిన అసలు విషయమేమిటంటే ఎఐ కేవలం ఊహా చిత్రాలను మాత్రమే గీయడం లేదు; అది నిజాన్ని గుర్తించే మనిషి ఇంద్రియశక్తినే పరీక్షిస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక (World Economic Forum) ప్రచురించిన ఒక వివరణలో, లాంకాస్టర్ యూనివర్సిటీకి చెందిన సోఫీ నైటింగేల్, డిజిటల్ ఫోరెన్సిక్స్ నిపుణుడు హనీ ఫరీద్‌ల సంయుక్త పరిశోధనలో ఒక దిగ్భ్రాంతికరమైన విషయం వెలుగుచూసింది. ఎఐ సృష్టించిన కృత్రిమ (సింథటిక్) ముఖాలు నిజమైన ముఖాల కంటే ఎక్కువ విశ్వసనీయమైనవిగా మనుషులు రేటింగ్ ఇచ్చారు. సగటున ఆ కృత్రిమ ముఖాలు నిజమైన ముఖాల కంటే 7.7 ఎక్కువ నమ్మదగినవిగా గుర్తించబడ్డాయి. ఇది చాలా ప్రమాదకరమైన సంకేతం. మోసం గుర్తించడంలోనే కాదు, నిజం చూడడంలోనూ మనిషి కళ్లకు ఉన్న శక్తిని ఎఐ చిత్రాలు మోసం చేస్తున్నాయి.

ఎఐ ఊహా చిత్రాలను అత్యంత సహజంగా రూపొందించగల స్థాయికి చేరుకోవడంతో, అవి మనిషి కంటికి అసలైన సంఘటనలకు సంబంధించిన చిత్రాల్లాగే కనిపిస్తున్నాయి. కొన్నిసార్లు నిజమైన ఫొటోల కంటే ఎక్కువ ఆకర్షణీయంగా, ఎక్కువ విశ్వసనీయంగా అనిపిస్తున్నాయి. ఇది అత్యంత ప్రమాదకరమైన పరిణామం. ఎందుకంటే ఇప్పటివరకు మనం "మన కళ్లతో చూసినదే నిజం" అనే భావన మీదే ఎక్కువగా ఆధారపడి జీవిస్తున్నాం. కానీ నేడు సామాజిక మాధ్యమాల్లో జరగని అల్లర్లు జరిగినట్టుగా, చెప్పని మాటలు చెప్పినట్టుగా..

అసలు సంభవించని ప్రకృతి విపత్తులు జరిగినట్టుగా ఎఐ సృష్టించిన చిత్రాలు వైరల్ అవుతున్నాయి. అంటే ఇప్పుడు ఒక అబద్ధానికి కేవలం మరో అబద్ధపు మాటల మద్దతే కాదు నిజంలా కనిపించే అబద్ధపు దృశ్యం కూడా సాక్ష్యంగా నిలుస్తోంది.

## ‘డీప్‌ఫేక్’ యుగం: ‘జ్ఞాన సంక్షోభం’, ‘లైయర్స్ డివిడెండ్’

ఎఐ ఇప్పుడు కేవలం చిత్రాల వరకే పరిమితం కాలేదు. వీడియోలు, స్వరాలు, ముఖకవళికలు, మాట్లాడే తీరు ఇవన్నీ కూడా నిజంలా సృష్టించగలుగుతోంది. డీప్‌ఫేక్ సాంకేతికతతో ఒక వ్యక్తి చేయని పనిని చేసినట్టుగా చూపించడం, చెప్పని మాటలు చెప్పినట్టుగా వినిపించడం కూడా సాధ్యమవుతోంది. దీంతో ఒక కొత్త ప్రమాదం ముంచుకొస్తుంది. అదేమిటంటే, నిజాన్ని అబద్ధంగా మార్చడం మాత్రమే కాదు అబద్ధాన్ని కూడా నిజంలా చూపించగలగడం. దీనినే యునెస్కో ‘జ్ఞాన సంక్షోభం’గా అభివర్ణించింది. అంటే మనం చూసేది, వినేది, సమాజంతో పంచుకునేది నిజమా? కాదా? అన్న మౌలిక జ్ఞానవ్యవస్థకే ముప్పు వాటిల్లుతోందని. ఈ పరిస్థితిలో ప్రమాదం రెండు దిశల్లో ఉంటుంది. మొదటిది, అసత్యాన్ని నిజమని నమ్మడం.



## ఫొటో భావన మారిపోతోందా?

ఒకప్పుడు కోర్టుల్లో, చరిత్రలో, వార్తల్లో ఫొటోలను బలమైన సాక్ష్యాధారాలుగా భావించేవారు. కానీ ఇప్పుడు ఒక చిత్రాన్ని నమ్మడానికి దాని మూలం, మెటాడేటా, ధృవీకరణ వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇకపై ఒక ఫొటోను చూడగానే “ఈ ఫొటో నిజమా? కాదా?” “దీన్ని ఎవరు సృష్టించారు?” దీని మూలం ఏమిటి? ఇది ఎలాంటి మార్పులకు గురైంది? అని ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సి వస్తోంది. అంటే నేడు నిజం ఒకప్పటిలా కంటికి కనిపించేదిగా మాత్రమే లేదు; మూలాలతో సహా ధృవీకరించుకోవాల్సిన అంశంగా మారుతోంది.

## కళాకారులకు ఏఐ వరమా? శాపమా?

గంటలు, రోజుల తరబడి శ్రమించి ఒక చిత్రాన్ని గీసే కళాకారుడి స్థానంలో, కొన్ని సెకన్లలోనే ఎఐ వేలాది చిత్రాలను రూపొందిస్తుండటం సృజనాత్మక రంగంలో ఆందోళన కలిగిస్తోంది.ఇది మనిషి శ్రమను, కళ విలువను తగ్గిస్తుందా అనే చర్చ ఇప్పుడు విస్తృతంగా జరుగుతోంది. అయితే, సాంకేతికత ఎప్పుడూ మానవ మేధస్సుకు పూర్తిస్థాయి ప్రత్యామ్నాయం కాలేదు. నేడు చాలామంది కళాకారులు ఎఐను ఒక శక్తివంతమైన సహాయక సాధనంగా ఉపయోగిస్తున్నారు. ఎఐ మనిషి ఆలోచనలకు వేగంగా రూపం ఇవ్వగలదు. కానీ మానవ జీవిత అనుభవం నుంచి, హృదయ లోతుల్లోంచి పుట్టే భావోద్వేగాన్ని మాత్రం ఎప్పటికీ భర్తీ చేయలేదు. ఒక కళాకారుడి ఊహకు ఎఐ రూపం ఇవ్వగలదు గానీ, ఆ ఊహ వెనుక ఉన్న జీవితం, అనుభూతి, భావప్రపంచాన్ని స్వయంగా సృష్టించలేదు.

## కృత్రిమ మేధస్సు పదునెక్కిన కత్తిలాంటిది

ఒక పదునెక్కిన కత్తితో పండును కోయవచ్చు. అదే కత్తితో ఇతరులకు హాని కూడా చేయవచ్చు. ఎఐ కూడా అలాంటిదే. స్వతహాగా ఎఐలో మంచి, చెడు అనే స్వభావాలు ఉండవు. దాన్ని ఉపయోగించే మనిషి ఆలోచనా విధానమే దాని ప్రభావాన్ని నిర్ణయిస్తుంది. విద్య కోసం ఉపయోగిస్తే అది జ్ఞానాన్ని అందిస్తుంది. కళ కోసం ఉపయోగిస్తే సృజనాత్మకతను పెంచుతుంది. చరిత్ర కోసం ఉపయోగిస్తే అలనాటి చారిత్రాత్మక ఘట్టాలను కళ్లముందు నిలబెడుతుంది. కానీ హింస, మోసం, ద్వేషప్రచారం, వినాశనం కోసం ఉపయోగిస్తే సమాజాన్ని, దేశాన్ని, మనుషుల మధ్య ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. అంటే కృత్రిమ మేధస్సు కేవలం ఒక సాధనం మాత్రమే; అసలు సూత్రధారి మాత్రం మనిషి ఆలోచనా విధానమే.

అందుకే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా C2PA (Coalition for Content Provenance and Authenticity) వంటి ఓపెన్ స్టాండర్డ్‌లు, అలాగే కంటెంట్ క్రెడిన్షియల్స్ వంటి వ్యవస్థలు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. ఇవి ఒక డిజిటల్ ఫైల్ ఎక్కడి నుంచి వచ్చింది, దానిలో ఎలాంటి మార్పులు జరిగాయి, దాన్ని ఎవరు సృష్టించారు వంటి ప్రోవెనాన్స్ (Provenance మూల చరిత్ర) సమాచారాన్ని భద్రపరుస్తాయి. భవిష్యత్తులో నిజం కంటికి నేరుగా కనిపించకపోవచ్చు. కానీ దాని డిజిటల్ చరిత్రలో మాత్రం అది నిక్షిప్తమై ఉండే అవకాశం ఉంది.

**ముగింపు:** UNESCO పేర్కొన్నట్లుగా, ఈ సంక్షోభానికి పరిష్కారం కేవలం సాంకేతిక గుర్తింపు సాధనాల్లో మాత్రమే లేదు; అది మానవ విద్యలో, విమర్శనాత్మక ఆలోచనలో, బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరసత్వంలో ఉంది. ముఖ్యంగా యువత, విద్యార్థులు, మీడియా సంస్థలు, సమాజం మొత్తం సమాచారాన్ని పంచుకునే ముందు జాగ్రత్తగా ఉండాలి. ఎఐ మన కళ్లను మోసం చేయగలదు. కానీ సమాజం నైతిక ప్రమాణాలతో, వివేకంతో కొత్త నియమాలను నిర్మించుకుంటే నిజం ఎన్నటికీ మాయమవదు; అది మరింత బాధ్యతాయుతమైన రూపంలో పునర్నిర్వచించబడుతుంది. సాంకేతికత ఎంత శక్తివంతమైనదైనా, నిజాన్ని శోధించే మానవ వివేకమే సమాజాన్ని రక్షిస్తుంది.

– ననుబోలు రాజశేఖర్

# వైద్యం-వ్యాపారమయం

ఆధునిక సమాజంలో వైద్యరంగం తన మానవీయ కోణాన్ని కోల్పోయి, లాభార్జనే పరమావధిగా సాగుతున్న వ్యాపారంగా మారడం అత్యంత దురదృష్టకరం. ఒకప్పుడు ఆర్థిక స్థితిగతులకు అతీతంగా ప్రాణరక్షణే ఏకైక లక్ష్యంగా సాగిన పవిత్ర వైద్యవృత్తి, నేడు కార్పొరేట్ శక్తులు, బీమా కంపెనీలు, ఔషధ దిగ్గజాల లాభాపేక్ష మధ్య నలిగిపోతోంది. వైద్యరంగం ఈ స్థాయిలో వాణిజ్యమయం కావడానికి కేవలం ఆసుపత్రులే కాదు, సమాజంలోని వ్యవస్థాగత లోపాలు కూడా కారణం.

## కమిషన్ల సంస్కృతి-లక్ష్యాలు

అత్యాధునిక సాంకేతికత పేరిట ఇప్పుడు రోగులను నిలువుదోపిడీ చేస్తున్నారు. కార్పొరేట్ యాజమాన్యాలు వైద్యులకు నెలవారీ లక్ష్యాలు విధించడంతో, అనవసర ల్యాబ్ పరీక్షలు, మితిమీరిన ఔషధాల సిఫార్సులు, అవసరం లేకున్నా ICU బెడ్లపై ఉంచడం సర్వసాధారణమైంది. చిన్న ఆసుపత్రుల నుండి బహుళజాతి కార్పొరేట్ వైద్యశాలల వరకు లాభమే ప్రథమ ప్రాధాన్యమైంది.

## వైద్య విద్య..వ్యయాలు

నేడు ప్రైవేట్ కళాశాలల్లో వైద్య విద్య అభ్యసించాలంటే కోట్లాది రూపాయల ఖర్చు వస్తోంది. అంత పెట్టుబడి పెట్టి చదివిన అభ్యర్థులు, వృత్తిలోకి రాగానే ఆ మొత్తాన్ని వసూలు చేసుకోవాలనే ఒత్తిడితో వ్యాపార ధోరణిని అలవరచుకుంటున్నారు. ఔషధ కంపెనీలు తమ బ్రాండ్లను ప్రచారం చేయడానికి వైద్యులకు విదేశీ పర్యటనలు, ఖరీదైన బహుమతులు అందిస్తాయి. దానికి ప్రతిఫలంగా వైద్యులు జనరిక్ మందులకు బదులు అత్యంత ఖరీదైన బ్రాండెడ్ మందులను రాయడం రోగుల పాలిట శాపంగా మారింది.

## సమాజంపై తీవ్ర ప్రభావం

ఈ వికృత ధోరణి వల్ల సమాజం కోలుకోలేని విధంగా దెబ్బతింటోంది. డాక్టర్-రోగి మధ్య ఉండాల్సిన విశ్వాసం నేడు కేవలం ఒక ఆర్థిక లావాదేవీగా దిగజారింది.



మధ్యతరగతి, పేద కుటుంబాల్లో ఒకరికి పెద్ద జబ్బు సోకితే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడుతోంది. కేవలం వైద్య ఖర్చుల వల్ల భారతదేశంలో ఏటా లక్షలాది కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువకు జారిపోతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఖర్చులకు భయపడి రోగాలను దాచుకుని, చివరి దశలో ప్రాణాలు కోల్పోతున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు.

**నాణేనికి మరోవైపు..** ఈ వ్యాపారీకరణ లేదా పెట్టుబడిదారీ విధానం వెనుక ఉన్న పెట్టుబడుల వల్లే వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయనేది కూడా వాస్తవం. పారిశ్రామికీకరణ వల్లే ప్రపంచ స్థాయి కార్పొరేట్ ఆసుపత్రులు, అత్యాధునిక శస్త్రచికిత్సా పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కొత్త ఔషధాల ఆవిష్కరణ, సంక్లిష్ట అవయవ మార్పిడి చికిత్సలు, రోబోటిక్ సర్జరీలు, క్యాన్సర్ పరిశోధనలు అంతర్జాతీయ స్థాయిలో వేగంగా విస్తరిస్తున్నాయి. అయితే, ఈ ప్రయోజనాలు ఎంత అద్భుతంగా ఉన్నప్పటికీ, ఇవి కేవలం ధనవంతులకే పరిమితమై, సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉన్నప్పుడు ఆ శాస్త్ర సాంకేతిక ప్రగతికి అర్థం లేదు.

**ఈ దుస్థితిని మార్చే పరిష్కార మార్గాలు:** వైద్యరంగాన్ని మళ్లీ మానవీయ పథంలోకి తీసుకురావడానికి తక్షణమే ఈ చర్యలు చేపట్టాలి. ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీని, శుల్కాలను అరికట్టడానికి ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయాలి. చికిత్సల, ల్యాబ్ పరీక్షల ధరలను ప్రభుత్వం నియంత్రించాలి. ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయికి బలోపేతం చేయవచ్చు. ఆయుష్మాన్ భారత్, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలను మరింత బలోపేతం చేయాలి. లోపాలు లేకుండా ప్రతి పౌరుడికీ ఉచిత, నాణ్యమైన వైద్యం అందేలా చూడాలి. జన ఔషధి కేంద్రాలను విస్తృతంగా అందుబాటులోకి తెచ్చి, వైద్యులు కేవలం జనరిక్ పేర్లనే ప్రిస్క్రిప్షన్‌పై రాసేలా కఠిన నిబంధనలు అమలు చేయాలి.

వైద్య విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు వృత్తిపరమైన నైతిక విలువలను తప్పనిసరిగా బోధించాలి. లాభాపేక్షలేని స్వచ్ఛంద, మిషనరీ వైద్య నమూనాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. వైద్యం జీవనోపాధి కోసం చేసే వృత్తి కావచ్చు, కానీ అది మానవత్వాన్ని బలితీసుకునే క్రూర వ్యాపారంగా మారకూడదు.

లాభాల మోజుతో మనుషుల ప్రాణాలను, శవాలను పణంగా పెడితే సమాజ మనుగడకే ప్రమాదం. వైద్యులను భగవంతుని స్వరూపంగా చూసే సంస్కృతి మనది.

ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వైద్య సమాజంపై, వ్యవస్థను చక్కదిద్దాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. కార్పొరేట్ శక్తులు విసురుతున్న లక్షల బిల్లుల చక్రవ్యూహం నుండి సామాన్య మానవుడు ఎప్పుడు విముక్తి పొందుతాడనేది నేటికీ మిగిలి ఉన్న మిలియన్ డాలర్ల ప్రశ్న!

**- రాము కోలా**

# మినీ టిబెట్ 'చంద్రగిరి'

ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దుల్లోని పర్లాకిమిడికి కొద్ది దూరంలో ఉండే చంద్రగిరిని మినీ టిబెట్ అని పిలుస్తారు. ఒడిశా, బరంపురం మధ్యలో పర్లాకిమిడి గ్రామం ఉంది. అక్కడ నుండి తొంభై కి.మీ. దూరంలో చంద్రగిరి ఉంది. ఈ ప్రాంతంలో ఇళ్లు, అస్పత్రులు, భవనాలు, నిర్మాణాలు, దేవాలయాలు అన్నీ టిబెట్‌లో వున్న మాదిరిగానే ఉంటాయి. అందుకే చంద్రగిరిని 'మినీ టిబెట్', 'ఫిరింగిపద' అని కూడా పిలుస్తారు.



ఒడిశాలోని గజపతి జిల్లాలో కొండల మధ్య దాగి ఉన్న ఒక అండమైన ప్రదేశమే చంద్రగిరి. దీనిని 'ఒడిశా మినీ టిబెట్' అని పిలుస్తారు. భారతదేశంలోని బౌద్ధ క్షేత్రాలలో, పర్యాటక ప్రదేశాలలో దీనికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ ప్రదేశాన్ని చూడగానే మనం పొరపాటున వేరే ప్రాంతానికి వచ్చామా? అని అనుభూతి కలుగుతుంది. టిబెట్‌లో వున్నటువంటి కట్టడాలు ఇక్కడ కనిపించడమే ఇందుకు కారణం. ప్రశాంత వాతావరణం కొలువైన ఈ మినీ టిబెట్‌ను చూసేందుకు పర్యాటకులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ప్రాంతంలో బౌద్ధ ఆలయాల గంటల చప్పుడు, బుద్ధుని ప్రవచనాలతో రెపరెపలాడే రంగు రంగుల జెండాలు, రహదారులు పర్యాటకుల్ని మరో లోకానికి తీసుకుని వెళతాయి. భారతదేశంలో ఉంటూనే ఒక భిన్నమైన దేశంలో ఉన్నామా? అనే అనుభూతి కలుగుతుంది. ఇక్కడి వీధులు, ప్రజల జీవన విధానం, వారి సంప్రదాయ దుస్తులు, ప్రార్థన చక్రాలు గాలిలో ఎగిరే రంగు రంగుల బౌద్ధ ప్రార్థన పతాకాలు టిబెట్ సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. ప్రశాంతతను కోరుకునే వారి కోసం ఇక్కడ అనేక బౌద్ధ ధ్యాన కేంద్రాలు ఉన్నాయి.

## టిబెటన్లు ఎలా వచ్చారు?

1959లో చైనా ఆక్రమణ తర్వాత టిబెట్ నుంచి దలైలామాతో సహా వేలాది టిబెటన్లు భారత్‌కు శరణార్థులుగా వచ్చారు. 1963 మే 1న మొదటి బ్యాచ్ టిబెటన్ శరణార్థులు చంద్రగిరి (జీరాంగ్)కు వచ్చి స్థిరపడ్డారు. ఒడిశా ప్రభుత్వం వారికి భూమి కేటాయించింది. చైనా టిబెట్‌ను ఆక్రమించుకున్నప్పుడు, వారి ఆధ్యాత్మిక నాయకుడు దలైలామాతో పాటు దాదాపు 85,000 మంది టిబెటన్లు భారతదేశానికి శరణార్థులుగా వచ్చారు. భారత ప్రభుత్వం వారికి దేశంలోని వివిధ ప్రాంతాలలో ఆశ్రయం కల్పించింది. వారిలో కొందరు చంద్రగిరిలో స్థిరపడ్డారు. అందులో భాగంగా 1963 మే 1న ఒడిశాలోని గజపతి జిల్లాలో ఉన్న చంద్రగిరి కొండల ప్రాంతంలో ఒక టిబెటన్ శరణార్థుల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 1964 నాటికి ఈ ప్రాంతంలో 4 వేలమంది టిబెటన్లు ఇక్కడకు చేరుకుని స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. ఈ ప్రాంతాన్ని టిబెటన్లు ఫుంట్సోకింగ్ అని పేరు పెట్టుకున్నారు. 'సంతోషం, సమృద్ధి ఉన్న ప్రదేశం' అని దీని అర్థం. ఇది భారత్‌లోని ఆరు ప్రధాన టిబెట్ శరణార్థి శిబిరాలలో ఒకటి. చంద్రగిరిలో స్థిరపడిన టిబెటన్లు ప్రస్తుతం అయిదు కాలనీలలో నివసిస్తున్నారు. వీరిని సెటిల్‌మెంట్స్ అంటారు. వీరి చదువులు, వివాహాలు, వ్యాపారాలు అన్నీ ఇక్కడే జరుగుతాయి. ఇక్కడ స్థిరపడిన టిబెటన్లు ప్రధానంగా ఉన్ని వస్త్రాల అమ్మకం, తివాచీ పరిశ్రమ, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటారు. మొక్కజొన్నను అధికంగా పండిస్తారు. పూర్వం ఇక్కడికి శరణార్థులుగా వచ్చినవారు చాలా మంది చనిపోయారు. వారి సంతానం ప్రస్తుతం మినీ టిబెట్ చంద్రగిరిలో స్థిరపడి జీవనం కొనసాగిస్తున్నారు.

## పద్మసంభవ బౌద్ధ మహా విహారం

తమ మతాన్ని, సంస్కృతిని, రాబోయే తరాలకు అందించడానికి ఒక గొప్ప ఆధ్యాత్మిక కేంద్రం ఉండాలని ఇక్కడి టిబెటన్లు భావించారు. ఆ కారణంగా ఒడిశా మినీ టిబెట్ చంద్రగిరిలోని 'పద్మసంభవ మహావిహార్ బౌద్ధాలయాన్ని నిర్మించారు. దీన్ని స్థానికంగా జీరో టెంపుల్, జీరాంగ్ మోనాస్టరీ అని కూడా పిలుస్తారు. ఇది ఒక కట్టడం మాత్రమే కాదు, ఒక జాతి పోరాటం, ఆశ్రయం. టిబెట్‌వారి సంస్కృతిని కాపాడుకున్న చరిత్రకు సజీవ సాక్ష్యం. 1998లో దలైలామా సమక్షంలో ఈ బౌద్ధ విహార్ నిర్మాణానికి సంబంధించిన ఒప్పందం కుదిరింది. 2003లో ఈ ఆలయ నిర్మాణానికి పునాది రాయి పడింది. దాదాపు ఐదు సంవత్సరాల కఠిన శ్రమ, శిల్పుల నైపుణ్యంతో

2008లో నిర్మాణం పూర్తయింది. 2010 జనవరిలో టిబెటన్ల అత్యున్నత గురువు 14 దలైలామా చేతుల మీదుగా ఈ పద్మసంభవ మహావిహార్ అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఒకప్పుడు శరణార్థులుగా వచ్చిన ఒక జాతి, తమ సంస్కృతిని సజీవంగా ఉంచుకుంటూ నిర్మించుకున్న ఈ పద్మసంభవ మహావిహారం, నేడు ఒడిశా పర్యాటక రంగంలో ఒక మకుటాయమానమైన క్షేత్రంగా విరాజిల్లుతోంది.

## 'పద్మసంభవ' అనే పేరు ఎందుకు వచ్చింది?

ఈ విహారానికి ఆచార్య పద్మసంభవ (గురు రింపోచే) పేరు పెట్టారు. దీని వెనుక ఒక ఆసక్తికరమైన నమ్మకం ఉంది. 8వ శతాబ్దానికి చెందిన బౌద్ధ గురువు ఆచార్య పద్మసంభవ అప్పటి 'ఒడ్డియానా' (ప్రస్తుత ఒడిశా ప్రాంతం)లో జన్మించారని, ఆయనే భారతదేశం నుండి టిబెట్‌కు వెళ్లి అక్కడ వజ్రయాన బౌద్ధమతాన్ని వ్యాప్తి చేశారని నమ్ముతారు. అలా ఒడిశాకు టిబెట్‌కు ఉన్న ప్రాచీన బౌద్ధ సంబంధానికి ప్రతీకగా ఈ విహారానికి ఆయన పేరు పెట్టారు.

## మహావిహారంలో ప్రత్యేకతలు

ఈ మహావిహారం తూర్పు భారతదేశంలోనే అతిపెద్ద బౌద్ధ విహారంగా ప్రసిద్ధి చెందింది. ఈ నిర్మాణంలోని వాస్తుశిల్పంలో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి.ఈ ఆలయాన్ని ప్రాచీన నలందా విశ్వవిద్యాలయానికి చెందిన 'అతాన్‌పురి శైలి'లో నిర్మించారు. టిబెట్, నేపాల్, భూటాన్ దేశాల నుండి వచ్చిన ప్రత్యేక శిల్పులు, స్థానిక కార్మికులతో కలిసి దీనిని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇది 10 ఎకరాల విస్తీర్ణంలో, 5 అంతస్తులతో, 70 అడుగుల ఎత్తుతో గంభీరంగా దర్శనమిస్తుంది. ఆలయ ప్రధాన మందిరంలో 23 అడుగుల ఎత్తున్న బుద్ధుని విగ్రహం ఉంటుంది. దీనితో పాటు 17 అడుగుల ఎత్తున్న పద్మసంభవ విగ్రహం, వెయ్యి కళ్ళు, వెయ్యి చేతులు ఉన్న అవలోకితేశ్వరుని విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణలు. ఐదు అంతస్తుల ఈ భవనం లోపలి గోడలపై టిబెటన్ సంస్కృతి, బౌద్ధ జాతక కథలు, ప్రకృతి, ఆధ్యాత్మిక మండలాలు ఎంతో రంగులమయంగా పెయింటింగ్స్ రూపంలో చెక్కడం విశేషం. ప్రస్తుతం ఈ విహారంలో దాదాపు 200 మందికి పైగా బౌద్ధ సన్యాసులు నివసిస్తున్నారు. ఇక్కడ బౌద్ధ మత గ్రంథాల అధ్యయనం కోసం ఒక ప్రత్యేక పాఠశాల, ధ్యాన కేంద్రాలు, హాస్టళ్లు ఉన్నాయి. ప్రతి సంవత్సరం టిబెటన్ల నూతన సంవత్సరం 'లోసార్' బుద్ధ పూర్ణిమ పండుగలను ఇక్కడ ఎంతో ఘనంగా జరుపుకుంటారు. ఈ పండుగను ఆంగ్ల క్యాలెండర్‌ను అనుసరించి ఫిబ్రవరి లేదా మార్చి నెలల్లో జరుపుకుంటుంటారు. ఈ సమయంలో బౌద్ధ సన్యాసులు చేసే సంప్రదాయ 'చామ్ నృత్యం' (లామా డ్యాన్స్ ముఖానికి ముసుగులు ధరించి చేసే నృత్యం) చూడ ముచ్చటగా ఉంటుంది.



## ప్రకృతి సౌందర్యం

చంద్రగిరి కేవలం ఆధ్యాత్మిక కేంద్రం మాత్రమే కాదు, ప్రకృతి ప్రేమికులకు ఒక స్వర్గధామం. చుట్టూ దట్టమైన అడవులు, ఎత్తైన కొండలు, పచ్చని లోయలు, మొక్కజొన్న తోటలతో ఈ ప్రాంతం ఎంతో అహ్లాదకరంగా ఉంటుంది. మినీ టిబెట్‌లోని ఇళ్ళు దాదాపు చెక్కతో నిర్మించినవే. ఇక్కడ స్థిరపడిన టిబెటన్లు మొక్కజొన్నను పండించడం వల్ల ప్రతీ ఇంటిలో మొక్కజొన్న కండెలు నిల్వ చేసుకునే గదులను నిర్మించుకుంటారు. టిబెటన్లు ఒరియా, హిందీ భాషను మాట్లాడతారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రదేశం కావడం వల్ల కొందరు టిబెటన్లు తెలుగు కూడా మాట్లాడటం విశేషం. ఇక్కడి వాతావరణం ఏడాది పొడవునా చల్లగా ఉంటుంది. చంద్రగిరి అత్యుత్తమ నాణ్యత గల టిబెటన్ ఉన్ని తివాచీలకు చాలా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి శరణార్థులు తమ సాంప్రదాయ పద్ధతిలో చేతులతో అద్భుతమైన డిజైన్లతో తివాచీలు, శాలువాలు, స్వెట్టర్లను నేస్తారు. పర్యాటకులు వీటిని నేరుగా వారి నుంచే కొనుగోలు చేయవచ్చు. ఇవి కాకుండా వివిధ రకాల టిబెటన్ హస్తకళల వస్తువులు ఇక్కడ లభిస్తాయి. మినీ టిబెట్ చంద్రగిరిలో శ్రేష్టమైన జాతికి చెందిన కుక్కలను కూడా పెంచుతుంటారు.

ఆధ్యాత్మిక శాంతి, అద్భుతమైన ప్రకృతి సౌందర్యం, విభిన్నమైన సంస్కృతుల కలయికే చంద్రగిరి అసలైన ప్రత్యేకత. ఒకేచోట బౌద్ధ సన్యాసుల మంత్రోచ్ఛారణలు, కాలుష్యానికి దూరంగా, స్వచ్ఛమైన గాలి, ప్రశాంతమైన వాతావరణాన్ని, విలక్షణమైన జీవన విధానాన్ని చవిచూడాలనుకుంటే చంద్రగిరిని తప్పక సందర్శించాలి.

**– షేక్ అబ్దుల్ హకీం జాని**

> మేఘం, వర్షం లేకుండా ఇంద్రధనుస్సు వుండదు.
> – జె.హెచ్.విన్సెంట్
>
> పాఠకుడు కాకుండా రచయిత కాలేడు. – హేరీ గోల్డెన్

# 'వంశవేధ' అంటే ఏమిటి?



వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458

**సి.భానుప్రకాశ్, కొత్తకోట**

ప్రశ్న: 'వంశవేధ' వల్ల ఎలాంటి ఫలితాలు ఉంటాయి? దానికి ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉన్నాయా?

**జవాబు:** ఒక గృహంలో గోడలు, స్థంభాలు, దూలాలు పారుదప్పి వున్నట్లయితే 'వంశవేధ' అనే వాస్తుదోషం సంభవిస్తుందని వాస్తు శాస్త్రంలో పేర్కొన్నారు. ప్రాచీన నిర్మాణ పద్ధతులతో ప్రస్తుత నిర్మాణ పద్ధతులను విశ్లేషించినట్లయితే అప్పటి చెక్క/మట్టి స్థంభాలు, చెక్క దూలాలు ఇప్పటి సిమెంట్ 'పిల్లర్స్', సిమెంట్ 'బీమ్స్'గా పేర్కొనవచ్చు. ప్రస్తుత నిర్మాణ పద్ధతుల్లో కూడా పిల్లర్లు, బీములు గోడ లోపలికి కలిసిపోవాలి. అలాగాక అవి పూర్తిగా గది మధ్యలోకి కనిపిస్తున్నట్లయితే ఈ వంశవేధ దోషం సంభవిస్తుంది.

నిర్మాణ క్రమంలో పిల్లర్లు, బీములు వేసిన తర్వాత గదుల వైశాల్యాన్ని పెంచాలన్న ఆలోచనతో పారుదప్పి కట్టే గోడలు పిల్లర్లను, బీములను 'కలుపుకొని' గాకుండా కాస్త ముందు వెనుకలకు కడతారు. ఇలా కట్టటం వలన పిల్లర్లు, బీములు పూర్తిగా కనిపిస్తాయి. ఈ విధంగా ఈ దోషం ఏర్పడుతుంది.



అంతేగాక మరొక వాస్తు నియమాన్ని అతిక్రమించటం వలన కూడా ఈ దోషమేర్పడుతుందని పేర్కొన్నారు. వారసత్వంలో ప్రాప్తించిన ఒకే గృహంలో నివసించవలసి వచ్చినప్పుడు లేదా, ఒకే ఖాళీ స్థలంలో వివిధ గృహాలు నిర్మించుకొన్నప్పుడు- జ్యేష్ఠులు (పెద్దవారు) పశ్చిమ దక్షిణ దిక్కుల్లో కనిష్ఠులు (చిన్నవారు) తూర్పు, ఉత్తర దిక్కుల్లోను ఉండాలి. అలాగాక అందుకు విరుద్ధంగా నివసించినట్లయితే 'వంశవేధ' దోషం కలుగుతుంది. ఈ వేధ వలన ఐశ్వర్యహాని, దారిద్ర్యం, వంశహాని కలుగుతుందని తెలిపారు. ఈ దోషం వలన కలిగే దుష్ఫలితాల తీవ్రత ఆయా దోషాల తీవ్రతను బట్టి ఉంటుంది.

గృహ వాస్తు దోషాలను సవరించుకోవటం ద్వారా చెడు ఫలితాలను నివారించుకోవచ్చు. మంచి ఫలితాలను కూడా పొందవచ్చు.

**ఎస్.వెంకటేశ్,నాయుడుపేట**

## పాత కలప ఉపయోగించవచ్చా?

**ప్రశ్న: చాలా కాలం క్రితం అగ్నిప్రమాదం జరిగింది. ఇంట్లో ఉన్న కలప కొంత భాగం మంటల్లో తగలబడిపోయింది. నీళ్ల కొట్టి మంటలార్పారు. మిగిలిన కర్రలు అలాగే ఉన్నాయి. కాలినంత భాగం వరకు రంపంతో తీసేసిన తరువాత మిగతా భాగం బాగుంది. వీటిని తలుపులు, కిటికీలు, ఫర్నిచర్‌కు ఉపయోగించుకోవచ్చా?**

**జవాబు:** అగ్నిప్రమాదంలో తగలబడిన చెక్కను ఉపయోగించి గృహ నిర్మాణం గావించుకున్నట్లయితే 'దగ్ధకాష్టవేధ' అనే వాస్తుదోషం కలుగుతుంది. అందువల్ల అనేక రకల ఇక్కట్లపాలు కావలసి వస్తుంది.

గృహ నిర్మాణంలో ఆ కర్రలను ఉపయోగించటం సులభం. దోషం అని తెలిసిన తరువాత వాటిని విడదీయటం, సరిచేయటం చాలా కష్టతరమవుతుంది. పొరపాట్లు జరిగితే మళ్లీ అదొక దోషం అవుతుంది (వెనుగర్రల విషయంలో). అందువల్ల 'పొదుపు' అని ఆలోచించకుండా వెనుగర్రలకు, తలుపులు, కిటికీలు, వెంటిలేటర్స్, ఫర్నిచర్‌కు కాలిన కర్రలను ఉపయోగించకండి. కొత్త కలపను ఉపయోగించటమే శ్రేష్ఠమైన పద్ధతి. ■

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే,
రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ..............................................
పుట్టిన తేది : ..............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................
చిరునామా:..................................................

– మరణానికి సిద్ధమైన వ్యక్తి స్వేచ్ఛగా జీవిస్తాడు.

– సముద్రం తన తీరాన్ని దాటి ఎరగదు, మనిషి జీవన మరణాలు దాటి ఎరగడు.

# సంవత్సరమంతా చందనంతో..

**తమిళనాడులోని అత్యంత అద్భుతమైన శివాలయాలలో ఒకటి ఉత్తరకోసమంగై. ఇక్కడ ఉన్న మరకత నటరాజ విగ్రహం చాలా ప్రసిద్ధి చెందింది. నటరాజస్వామిని సందర్శిస్తే మోక్షం లభిస్తుందని ఆస్తికుల విశ్వాసం. ఏడాది పొడవునా చందనంతో దర్శనమిస్తారు స్వామివారు. నటరాజస్వామిని ఆకుపచ్చలో సంవత్సరానికి ఒకసారి మాత్రమే అదీనూ ఆరుద్ర దర్శనం రోజున చూడవచ్చు.**

ప్రపంచంలోనే మొట్టమొదటి శివాలయం, తమిళనాడులోని అత్యంత పురాతనమైన, అతి ముఖ్యమైన ఆలయాలలో ఒకటి ఉత్తరకోసమంగై ఆలయం. చిదంబరం తర్వాత ఉత్తరకోసమంగై ఆలయంలోనే అత్యంత ముఖ్యమైన నటరాజ ఆలయాలలో ఒకటిగా పరిగణిస్తారు. ఈ ఆలయం గురించి చాలా మందికి తెలియని కొన్ని అద్భుతమైన విషయాలను చూద్దాం...

రామనాథపురం జిల్లాలో ఉత్తరకోసమంగై అనే పవిత్ర ఆలయం ఉంది. పురాణాలు, ప్రాచీనత ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న ఈ అద్భుతమైన ప్రదేశం మరింత తెలుసుకోవాలనే ఆసక్తిని పెంచుతుంది. ఉత్తరకోస మంగైలోని మూలవిరాట్టు స్వయంభువ లింగం. సుమారు మూడు వేల సంవత్సరాల పురాతనమైనదని పరిశోధకులు అంచనా.

సుమారు ఇరవై ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ ఆలయానికి ఓ రాజు చాలా భూమిని, గొర్రెలను దానం చేసి, పునరుద్ధరణకు పూనుకున్నాడని శాసనాల వల్ల తెలుస్తోంది. ఉత్తరకోసమంగై శివుని స్వస్థలం అని పురాణ కథనం. తిరువిలయాడల్ అనే తమిళ పురాణం పరమేశ్వరుడి లీలల గురించి విపులంగా ప్రస్తావించింది.

పాండ్య రాజులు స్వయంగా ఉత్తరకోస మంగై ఆలయానికి ప్రధాన పునర్నిర్మాణాలు చేశారు. పాండ్య రాజులు అధికారంలో ఉన్నప్పుడు, ఉత్తరకోశ మంగై కొంతకాలం వారి రాజధానిగా కూడా ఉండేది.

ఈ ఆలయాన్ని శివపురం, దక్షిణ కైలాసం, చతుర్వేది మంగళం, ఇలాందికైపల్లి, బ్రహ్మపురం, వ్యాఘ్రపురం, మంగళపురి, ఆది చిదంబరం వంటి అనేక పేర్లతో పిలిచేవారు. దీనికి సంబంధించిన శాసనాలు, రాతప్రతులు ఉన్నాయి.



ఇక్కడి స్వామిని మంగళనాథ స్వామిగా ఆరాధిస్తారు. ఈ స్వామినే మంగళేశ్వరర్ అని, కడి కుట్ట నాయకర్ అని, ప్రళయకేశ్వరర్ అని కూడా పిలుస్తారు. ఇక్కడి అమ్మవారిని మంగళేశ్వరి, మంగళాంబిగై, సుందరనాయకి అని పిలుస్తారు. అమ్మవారిని స్తుతిస్తూ, ప్రముఖ తమిళ కవి వి.టి. సుబ్రమణ్యం పిళ్లై రాసిన కృతి 1901లో తొలిసారిగా వెలువడింది. ఈ పుస్తకం 1956లో పునర్ముద్రితమైంది.

రావణుడిని చంపిన పాపం, అపరాధం నుండి విముక్తి పొందడానికి రామేశ్వరంలో పూజలు చేశాడని పురాణగాథ. ఇక్కడ, రావణుడి భార్య మండోదరి పేరు ఉత్తరకోసమంగైలోని శాసనాలలో కనిపిస్తుంది. కాబట్టి, ఈ ఆలయం రామాయణ కాలం నాటి శాసనంగా పరిగణిస్తారు. వేదవ్యాసుడు, కాకా భుజందార్, వనసురన్, మాయ, మాణిక్యవాచగర్, అరుణిగిరినాథర్ ఈ ఆలయంలో పూజలు చేసి భగవంతుని ఆశీస్సులు పొందారంటారు. చిదంబరం లాగే, ఇక్కడ నటరాజ స్వామి ప్రత్యేకమైన స్వామి.

ఇక్కడి పంచలోహ నటరాజ స్వామి చాలా ప్రత్యేకం. పురుషులు కుడి వైపున, మహిళలు ఎడమ వైపున నృత్యం చేసినట్లు శాసనాల వల్ల తెలుస్తోంది. నటరాజ విగ్రహం కూడా పురాతనమైనదని పరిశోధకుల అభిప్రాయం. కుమారస్వామి వాహనంగా ఏనుగును తిలకించవచ్చు. పురాతన గ్రంథమైన 'ఆది చిదంబరం మహత్యం' ప్రకారం

ఈ క్షేత్రంలోనే ఇంద్రుడు తన ఐరావతాన్ని కుమారస్వామికి ఇచ్చాడని చరిత్రకారులు చెబుతున్నారు!

సంగం సాహిత్యంలో ఉత్తరకోశ మంగై గురించి ప్రస్తావన ఉంది. ఉత్తరకోస మంగై మాణిక్యవాచకుడికి ప్రత్యేక దర్శనం ఇచ్చిన ప్రదేశంగా మరో ప్రత్యేకతను కలిగి ఉంది.

అమ్మవారు ప్రతిరోజూ ఈ ప్రదేశంలో స్వామిని పూజిస్తుందని విశ్వాసం. పార్వతీదేవికి పరమేశ్వరుడు ఇక్కడే వేదాలను బోధించాడని కథనం. అనంతరం అమ్మవారితో కలిసి మధురైకి వెళ్ళాడని మధురై పురాణం పేర్కొంది.

కొంత కాలం పాటు, ఈ ప్రదేశం ఆదిశైవుల ఆధీనంలో ఉండేది! తరువాత దానిని రామనాథపురం రాజుకు అప్పగించారు. అప్పటి నుండి రామనాథపురం రాచరిక రాజ్య పాలనలో ఉందనే వాస్తవం దీనికి నిదర్శనం!

లోపలి ప్రాంగణంలోకి ప్రవేశించేటప్పుడు శిల్పుల నైపుణ్యానికి నిదర్శనంగా అనేక శిల్పాలను చూడవచ్చు. పైగా రెండు శిల్పాలలో నోటిలో ఉన్న రాతి బంతిని మన చేతులతో అంటూ ఇటూ తిప్పవచ్చు!



సాధారణంగా, పూజలో మొగలిరేకును చేర్చరు. కానీ ఇక్కడ, ప్రదోషం రోజున దానితో పూజిస్తారు. ఈ ఆలయంలో స్వామివారికి, దేవేరికి మొగలిపువ్వు మాల సమర్పిస్తే, దోషాలు తొలగిపోతాయని ఆస్తికులు విశ్వాసం!

ఇక్కడ ఒక పురాతన వారాహి ఆలయం ఉంది. ప్రతి శుక్రవారం, మంగళవారం, ఆదివారం రాహుకాలంలో ఇక్కడ వారాహిని పూజిస్తే, పరిష్కారం కాని సమస్యలు, వివాహ అడ్డంకులు మొదలైనవి తొలగిపోతాయని స్థానికులంటారు. ఆ కాలంలోనూ వారాహి ఆరాధన ఇక్కడే ఉండేదని దీనివల్ల అర్థమవుతుంది!

1300లో ఢిల్లీని రాజధానిగా చేసుకుని పాలించిన అల్లావుద్దీన్ ఖిల్జీ, ఉత్తరకోశ మంగైలోని మరకథ నటరాజ విగ్రహాన్ని దోచుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. దాదాపు 60 వేల మంది శివ భక్తులు ఇక్కడ జ్ఞానం పొందారని చెబుతారు.

ఇక్కడ, శ్రీమంగళనాథ మందిరం, మంగళేశ్వరి మందిరం, మరకత నటరాజ మందిరం, సహస్రలింగ మందిరం వంటివి ఈ ఆలయం ప్రత్యేకం. 'ధ్వజ వృక్షం' ఉండటం గమనార్హం. కారైకల్ అమ్మయార్ కూడా ఇక్కడికి వచ్చి స్వామిని పూజించారు.

ఉత్తరకోసమంగై ఆలయ నిర్మాణం ద్రావిడ వాస్తుశిల్పం ఆధారంగా ఏర్పాటైందంటారు. ఈ ఆలయంలో తిరువాదిరై, మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. స్వామికి సమర్పించిన గంధాన్ని నటరాజస్వామి మరకత రాయిపై ఉంచి వేడి నీటిలో కరిగించి తాగితే, నయం కాని వ్యాధులు సైతం నయమవుతాయని భక్తుల విశ్వాసం. ఈ ఆలయంలో పదకొండు గణేశ విగ్రహాలను ప్రతిష్ఠించారు. మహాలక్ష్మి సన్నిధి సైతం దర్శించుకోవచ్చు.

– యామిజాల జగదీశ్

## అరుదైన పుస్తకాలు

### ఆర్కిమీడీస్ పాలింప్సెస్ట్: అక్షరాల వెనుక దాగి ఉన్న సైన్స్

మధ్య యుగ కాలంలో కాగితం/తోలుపత్రాలు చాలా ఖరీదైనవి. అందుకే పాత పుస్తకాలలోని అక్షరాలను తుడిచేసి, వాటిపై మళ్లీ రాసేవారు. దీనిని 'పాలింప్సెస్ట్' అంటారు. 1998లో ఒక ప్రార్థనా గ్రంథం వేలంలో భారీ ధరకు అమ్ముడైనప్పుడు, పరిశోధకులు ఆధునిక సాంకేతికతతో దానిని పరిశీలించారు. ఆ ప్రార్థనల కింద అస్పష్టంగా మరికొన్ని అక్షరాలు కనిపించాయి. అల్ట్రావయొలెట్ కాంతి మరియు డిజిటల్ ఇమేజింగ్ సాయంతో చూసినప్పుడు వారికి మతిపోయే సత్యం తెలిసింది. ఆ ప్రార్థనల కింద దాదాపు 2000 ఏళ్ల నాటి గణిత శాస్త్రవేత్త 'ఆర్కిమీడీస్' అసలు సిసలు రచనలు ఉన్నాయి.

ముఖ్యంగా 'ది మెథడ్' అనే గ్రంథంలో ఆర్కిమీడీస్ చర్చించిన గణిత సూనరతాలు, ఆధునిక కాలంలో మనం వాడుతున్న 'కాల్కులస్' సిద్ధాంతాలకు పునాదులని తేలింది. అంటే, ఆధునిక శాస్త్రవేత్తలు కనిపెట్టారని భావించిన కొన్ని గణిత రహస్యాలను ఆర్కిమీడీస్ అప్పుడే రాసిపెట్టాడు. కానీ ఒక క్రైస్తవ సన్యాసి ప్రార్థనలు రాసుకోవడానికి ఆ పత్రాలు అవసరమై, ఆర్కిమీడీస్ రచనలను తుడిచేశాడు. అదృష్టవశాత్తూ ఆ అక్షరాలు పూర్తిగా చెరిగిపోలేదు. విజ్ఞాన శాస్త్ర చరిత్రలో ఇది ఒక అద్భుతమైన మలుపుగా నిలిచిపోయింది.

– రవికుమార్

# డా॥ డి.వి.జి. సాహితీ ప్రస్థానంలో కథాత్మక కమనీయత

డా॥ డి.వి.జి. శంకరరావు, వైద్యునిగా, రాజకీయ వేత్తగా, సామాజిక సంక్షేమాన్ని అభిలషించే పత్రికా రచయితగా లేఖలు, వ్యాసాలు, కథలు, కవితలు వివిధ ప్రక్రియలలో నిరంతరం స్పందించే సహృదయ సాహితీవేత్త. ఈ సంపుటిలో 50 కథలను ప్రచురింపచేసారు. చిన్న కథలో సున్నిత కథనం సృష్టించి హాస్య, వ్యంగ్యాత్మకంగా సందేశం అందించటంలో డా॥ డివిజి ప్రతిభ వ్యక్తం అవుతోంది. అద్దం అబద్ధం చెప్పదన్నా, పంతం అంతంలో అయినా నాన్నను కూతురివై పుట్టమని రాసినా, ఛాయిస్ కథలో గోహత్యా పాతకం, హిప్నొకాంపస్ హాల్యూసినేషన్స్ గురించి కథ అల్లటం డా॥ డి.వి.జి. సాధ్యం. 'డాక్టరుగారు' కథలో, డాక్టర్ రోగిని చూసే దృష్టికోణం, వైద్య వృత్తిలో మానవతా విలువలు ప్రతిబింబింపచేయటం, 'కరోనా రూపేణా'లో మానవ సంబంధాలు ప్రతీ కథ ఆసక్తితో చదివింపచేస్తున్నాయి. సామాజిక బాధ్యత, నిజాయితీతో భావుకత, హృదయాన్ని



స్పృశించే మానవతా విలువలు, ప్రతీ కథకు చక్కటి ముగింపు యిచ్చారు. వర్తమాన సమాజ వ్యవహారాలలో మానవ మనస్తత్వ పోకడలను సునిశితంగా పరిశీలించే తాత్త్వికతతో కలాన్ని కదిలించే డా॥ డి.వి.జి. కథా రచనలో కృతకృత్యత సాధించారని ఈ సంపుటి స్పష్టం చేస్తోంది.

**(డి వి జి కథలు–రచన: డా॥ డి.వి.జి.శంకరరావు; వెల: రూ.250/–లు; ప్రతులకు: డా॥ డివిజి శంకరరావు, 50, కామాక్షి నగర్, విజయనగరం, ఆంధ్రప్రదేశ్–3)**

# చిన్నప్పటి జ్ఞాపకాలు కదిలించే కథలు

**పుస్తక సమీక్ష**

"నవ్వించడమే నా ఉద్దేశం కాదు. జీవితం అంత సీరియస్ కాదని గుర్తు చేయటమే నా ప్రయత్నం" అంటారు ఉప్మా బ్యాచ్ (ఇతర కథలు) పరిచయంలో మేదరమెట్ల చక్రధర్‌నాయుడు. జీవితంలోంచి పుట్టిన జ్ఞాపకాలు, అనుభవాలు, భావోద్వేగ సంఘటనలు, 21 కథలుగా రచయితే హీరోగా చెప్పిన ఈ సంపుటి ఒక్కబిగిన చదివింపచేసే, చాతుర్యంతో మనల్ని తీసుకుపోతుంది. తల్లిదండ్రుల బాధ్యత, చిన్నప్పటి స్నేహితులు, ఆటపాటలు, గురువులు, ఇంటి వాతావరణం ఎన్నో సంఘటనలు సృష్టించిన కథలు రచయిత కళ్ళకు కట్టించారు. అమాయకత్వం, చిలిపి అల్లరి, బాల్య చేష్టలు తెచ్చే ఆనందంతో పాటు దండనలు తెచ్చే కన్నీళ్ళు కూడా గుర్తుకొస్తాయి. వెళ్ళాలనుకొన్న దారిలో పెద్దలు వెళ్ళనివ్వరు. బాల్య చాపల్యం తెచ్చే





ఇబ్బందులు, ఆ జ్ఞాపకాలు పెద్దయ్యాక తలచుకొంటే, అందులో చక్రధర్ నాయుడు వంటి రచయితలకు ప్రతిభావంతమైన యిటువంటి రచనలతో చదువరులను ఎక్కడికో తీసుకువెళ్ళగలుగుతారు. జీవితంలో ముందుకు నడిచేకొద్దీ, వెనక్కి చూసుకుంటే, గత జ్ఞాపకాలు, స్మృతులు కదిలించగలిగే కథనాలు వినిపించిన రచయిత, సమంతస్మిత్‌కు గుండెలో గుడి కట్టుకోవడం చదువరులను కదిలిస్తోంది.

**(ఉప్మా బ్యాచ్(ఇతర కథలు)–రచన: మేదరమెట్ల చక్రధర్ నాయుడు; వెల: రూ.249/–; ప్రతులకు: మేదరమెట్ల చక్రధర్ నాయుడు, సమత ఇఎమ్ స్కూల్, గాజులపల్లి, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్)**

# బాలల కోసం విష్ణునామాల కథలు

చిన్న వయసులోని బాలబాలికలకు విష్ణు సహస్రనామం పట్ల దైవత్వ అనురక్తి కలిగించడానికి, ప్రతి నామానికి పిల్లలకు ఆసక్తి కలిగించే విధంగా ఆకట్టుకునేటట్లు కథను సృష్టించి 'వినండర్రా! విష్ణుకథ'గా బిందుమాధవి మద్దూరి, అభినందనీయమైన ఆధ్యాత్మిక సత్కృషి ప్రారంభించారు. 50 కథలతో మొదటి భాగంగా వెలువడిన ఈ ఆధ్యాత్మిక కథాసంపుటి, వ్యాసభగవానుడు భీష్మపితామహుని ద్వారా లోకానికి అందించిన నామ మహత్యాన్ని, పిల్లలకు లేత మనసులను కథలుగా అలరిస్తోంది.

'అనంత'తో ఆరంభమైన, ఆధ్యాత్మిక అంశాలు దేవదేవుడి చైతన్యం వరకు మొదటి భాగంగా వెలువరించారు. ఈ విష్ణుకథలు పిల్లల కోసం సృష్టించినా, రచయిత్రి పెద్దలకు అవసరమైన దివ్య జ్ఞానాన్ని, శ్రీమన్నారాయణ ఆధ్యాత్మిక సందేశంగా అందచేసారు. శ్రీ



మహావిష్ణువు అనుగ్రహం పొందాలంటే, పిల్లలు అతీత, అలౌకిక పరమాత్మను ముందు గుర్తించి, నిత్యం స్మరించుకొని కృతజ్ఞతా పూర్వకంగా ప్రవర్తించాలనే సందేశం,సృష్టి సర్వస్వం అంతా శ్రీమన్నారాయణుడేనన్ తాత్త్విక భావన ఈ పుస్తకం అందిస్తోంది. బామ్మ, తాతయ్యలు శ్లోకాల అంతరార్థాన్ని వివరించటమే కాకుండా బాలబాలికలకు ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగించేటట్లు విష్ణు సహస్రనామాలు నేర్పించటం, గంభీరమైన, లోతైన జ్ఞానాన్ని అత్యంత సరళంగా, ఆసక్తికరంగా చెప్పటం 'వినండర్రా విష్ణుకథ' ఇంటిల్లిపాదినీ తరింపచేస్తోంది.

**(వినండర్రా విష్ణుకథ–రచన: బిందుమాధవి మద్దూరి; వెల: రూ.100/–లు; ప్రతులకు: ఎన్.బిందుమాధవి, ఫ్లాట్ 402, శ్రీముఖ రెసిడెన్సీ, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్–73)**

– జయసూర్య

# 14 జూన్, 2026 నుండి 20 జూన్, 2026 వరకు



## వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం గతంలో సమసిపోయాయి అనుకున్న సమస్యలు కొత్త కోణంలో తారసపడతాయి. వారం మొదటిలో అనుకూల ఫలితాలు ఉన్నప్పటికీ చెప్పుకోదగిన ప్రయోజనాలు సమకూరవు. ఆదాయ, వ్యయాలలో సమతుల్యతను సాధించడానికి గాను కొత్త ప్రణాళికలను రూపొందించుకుంటారు. విద్యార్థులు మరింత శ్రద్ధగా కృషిని సాగించవలసి ఉంటుంది. నిత్యం అరావళి కుంకుమతో శ్రీ మహాలక్ష్మీదేవిని పూజించండి.

### వృషభం

ఈ వారం విలాసవంతమైన జీవితాన్ని గడపాలను కుంటారు. ఊహించని ఒడిదుడుకులను ఒక సందర్భంలో మీలో ధైర్యానికి మీరే ఆశ్చర్యపోతారు. ధనాదాయ మార్గాలను మెరుగుపరచు కోవడానికి విదేశాలకే వెళ్ళనవసరం లేదని భావిస్తారు. రాని మొండిబాకీలపైన దృష్టిని సారిస్తారు. వాహనం కొనుగోలు సూచనలు గోచరిస్తున్నాయి. స్నేహితులకు మీ వంతు సహాయ సహకారాలను అందిస్తారు. వ్రాత పూర్వక ఒప్పందాలు.

### మిథునం

ఈ వారం ఈ వారం అనుకున్న పనులన్నీ సాఫీగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా వుంటుంది మీ మాటకు విలువ పెరుగుతుంది. ఇతరులకు కూడా సహాయం అందజేస్తారు. పండితులు, ప్రముఖ వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్థిని వృద్ధి చేసుకుంటారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన జరుగుతుంది. సోదరులు, మిత్రుల ద్వారా అనుకోని విధంగా ధనలాభ సూచనలు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

### కర్కాటకం

ఈ వారం ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుకుంటారు. స్థిరాస్తి వృద్ధి చెందుతుంది. గృహం, వాహనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు. ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

### సింహం

ఈ వారం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా వుండండి. దూర ప్రాంతాల నుండి అందిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహకరంగా వుంటుంది. ముఖ్యమైన కార్యక్రమముల చర్చలు, అమలు చేయు పనులు వాయిదా పడతాయి. వస్తు, వస్త్ర, వాహన యోగం పొందుతారు.

### కన్య

ఈ వారం పనులు మందకొడిగా సాగుతాయి. ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. బాధ్యతలు అధికమవుతాయి. అష్టగణపతి పీఠాన్ని నిత్యం సిద్ధగంధంతో పూజించండి. వృత్తి, వ్యాపారాలలో మార్పులు ఉంటాయి. ఉద్యోగులకు బదిలీల సూచన. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి కొంతవరకు అనుకూలంగానే ఉంటుంది. విందు, వినోదాలలో పాల్గొంటారు.

### తుల

ఈ వారం అప్రయత్న కార్యసిద్ధి కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. పట్టుదలతో ముందుకు సాగుతారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. పెట్టుబడులలో లాభాలు పొందుతారు. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లభిస్తాయి. రాజకీయ, కళారంగాల వారికి యోగదాయకంగా ఉంటుంది. షేర్లు, భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. అనుకోని అతిథుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. సోదరులను కలిసి సంతోషంగా గడుపుతారు.

### వృశ్చికం

ఈ వారంముఖ్యమైన పనులు సాఫీగా పూర్తి చేస్తారు. విలువైన వస్తువులు, వస్త్రాలు వాహనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. దూర ప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. స్థిరాస్థి వివాదాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. వృత్తి వ్యాపారాలలో అనుకూలంగా వుంటుంది. తీర్థయాత్రలు చేస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ప్రముఖులను కలుస్తారు.

### ధనస్సు

ఈ వారం రాబడికన్నా ఖర్చులు అధికంగా ఉంటాయి. వస్త్ర వ్యాపారస్తులు, ఫైనాన్స్ రంగంలోని వారు మెలకువతో వ్యవహరించవలసి ఉంటుంది. నూతన కార్యక్రమాలను వాయిదా వేయడం మంచిది. మీ మనస్సులోని భావాలను ఇతరులకు తెలియనివ్వకండి. చిన్న చిన్న వివాదాలు చిలికి చిలికి గాలివానగా మారకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి. ఉద్యోగస్తులకు అనుకూలంగా ఉంటుంది. పనులు నిదానంగా సాగినప్పటికీ ప్రయోజనాలు పదిలంగా ఉంటాయి.

### మకరం

ఈ వారం ముఖ్యమైన పనులను విజయవంతంగా పూర్తి చేస్తారు. పట్టుదలతో ముందుకు సాగుతారు. ఋణాలు తీరుస్తారు. గృహ ప్రవేశాది శుభకార్యాలను అనుకున్న విధంగా పూర్తి చేయగలుగుతారు. ఆదాయ వ్యయాలు సరిసమానంగా ఉంటాయి. పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు. ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. విదేశీయాన ప్రయత్నాలు కలిసి వస్తాయి. లలిత కళల పట్ల అభిరుచిని కనబరుస్తారు.


### కుంభం

ఈ వారం ఉత్తరప్రత్యుత్తరాలను సాగిస్తారు. వైరి వర్గం కుట్రలను గమనించి తొందరపడకుండా అదును కోసం ఎదురు చూస్తారు. లీజులు, లైసెన్సులను తిరిగి పొందడానికి చేసే ప్రయత్నాలలో స్వల్ప ఆటంకాలు ఎదురౌతాయి. విదేశాలలోని మీ వారి యొక్క సహాయ సహకారాలు లభిస్తాయి. మంచిరోజులు రాబోతున్నాయి. అనే భావన కలిగించే విధంగా ఓ సంఘటన చోటు చేసుకుంటుంది. కొంత ధనాన్ని పొదుపు చేస్తారు. నిత్యం కనకధారాస్తోత్రం పఠించడం మేలు చేకూరుస్తుంది.


### మీనం

ఈ వారం దీర్ఘకాలిక సమస్యలకు కారణాలు తెలుసుకుంటారు. ఇష్ట దైవం మేలు చేశాడని ఆనందపడతారు. ఆర్థిక పరమైన అంశాలు బలపడతాయి. ఖర్చుచేసిన సొమ్ము వ్యర్థం కాదని గ్రహిస్తారు. సమయోచిత నిర్ణయాలు లాభిస్తాయి. మీరు ప్రోత్సహించి రంగంలోకి దించిన వ్యక్తులు ధైర్యంగా నిలబడరు. ప్రత్యర్థుల్ని మీరే స్వయంగా ఎదుర్కోవలసి వస్తుంది. వ్యాపారంలో రాబడి పెరుగుతుంది.

# ఈ వారం కార్టూన్స్


రోజూ నా వెనకాతే నడుస్తున్నావు..?
పరువు నష్టం దావా వేస్తా..!!


బ్రో.. మొహం మీద కొన్ని నీళ్లు చల్లవా..
వేడి తట్టుకోలేక పోతున్నా...!!


అన్నసార్.. బండి విలువ కంటే చలాన్లే ఎక్కువున్నాయి.
అందుకే బండి సరెండర్ చేద్దామనుకుంటున్నా..!!



ఫ్రాన్స్‌లోని
ప్రావెన్స్ లావెండర్
తోటలకు ఎంతో ప్రసిద్ధి
చెందింది. లూబెరాన్ లోయలో
జూన్-జులై నెలల్లో ఈ పూలు
విరగబూస్తాయి.





